అంగన్‌వాడీల ఆందోళన



జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద శనివారం నిరసన శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు

తమ ప్రధానమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడంతోపాటు జీతాలు పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, యాప్‌లు భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. - 8లో

స్కై సైక్లింగ్ ట్రయల్ రన్

- ఇప్పటికే జిప్ లైనర్ రెడీ... త్వరలో ప్రారంభం
- వారం రోజుల్లో గ్లాస్ బ్రిడ్జి పనులు మొదలు

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై అడ్వంచర్ స్పోర్ట్స్ పనులు ఒక్కొక్కటిగా పూర్తిచేస్తున్నారు. అక్టోబరు నెలలో జిప్ లైనర్ పూర్తిచేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు స్కై సైక్లింగ్ ప్రాజెక్టు కూడా పూర్తయింది. గత వారం రోజులుగా ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ అధికారులు మంచి ముహూర్తం చూసుకొని ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా వీటిని ప్రారంభించాలని యోచిస్తున్నారు.

వారం రోజుల్లో గ్లాస్ బ్రిడ్జి పనులు

కైలాసగిరిపై అడ్వంచర్ స్పోర్ట్స్ పనులను ఆర్‌జే అడ్వంచర్స్ సంస్థ చేపట్టింది. రెండు టువే జిప్ లైనర్లు, రెండు స్కై సైక్లింగ్ లైన్లు ఏర్పాటుచేసింది. కైలాసగిరిపై టైటానిక్ వ్యూ పాయింట్ వద్ద మరో వారం రోజుల్లో గ్లాస్ బ్రిడ్జి పనులు చేపట్టాలని నిర్ణయించింది. దీని పొడవు 50 మీటర్లు. ఇది కొండల మీదుగా సముద్రంలోకి ఉంటుంది. ఒకేసారి 40 మంది దానిని సందర్శించేలా పటిష్టంగా నిర్మించనున్నట్టు ఆర్‌జే అడ్వెంచర్ ప్రతినిధి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పీపీపీ విధానంలో రూ.6 కోట్లతో ఈ ప్రాజెక్టులు చేపట్టామన్నారు. ఆర్‌జే అడ్వెంచర్ స్పోర్ట్స్, ఎస్ఎస్ఎం షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్, భారత్ మాత వెంచర్స్ కలిసి జాయింట్ వెంచర్‌గా దీనిని చేపట్టామన్నారు.



స్కై సైక్లింగ్ ట్రయల్ రన్

డీఆర్ఎం కార్యాలయంలో సీబీఐ విచారణ?

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వే డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో సీబీఐ అధికారులు శనివారం విచారణ నిర్వహించినట్టు తెలిసింది. ఢిల్లీ నుంచి వచ్చిన సీబీఐ అధికారులు, స్థానిక సీబీఐ సిబ్బంది సహకారం తీసుకున్నట్టు చెబుతున్నారు. అయితే డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ స్థానికంగా లేరు. సెలవులో ఉన్నారు. గతంలో డీఆర్ఎంగా పనిచేసిన అధికారిపై అప్పట్లోనే పలువురు ఫిర్యాదులు చేశారు. ఆ ఆరోపణలపై ఇప్పుడు విచారణకు వచ్చి ఉండవచ్చునని అంటున్నారు.

నారీమణుల జిమ్ బాట

గడచిన నాలుగేళ్లుగా పెరిగిన సంఖ్య

- ప్రతి జిమ్‌లో 40 శాతం మంది మహిళలే...
- మహిళల కోసం ప్రత్యేకంగా జిమ్‌లు ఏర్పాటు
- బరువు తగ్గేందుకు కొందరు, ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం మరికొందరు...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మహిళల్లో ఒబేసిటీ, కీళ్లనొప్పులు వంటివి పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్యుల సూచనలు, ఆరోగ్యంపై అవగాహనతో చాలామంది వ్యాయామంపై దృష్టిసారిస్తున్నారు. కొందరు ఉదయాన్నే లేచి వాకింగ్, జాగింగ్ వంటివి చేస్తుండగా, మరికొందరు జిమ్‌లో చేరుతున్నారు. జిమ్ అంటే సాధారణంగా పురుషులు మాత్రమే వెళతారన్న భావన ఉండేది. అయితే, గడిచిన కొన్నాళ్లుగా జిమ్‌లో చేరుతున్న మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. కరోనా తరువాత జిమ్‌కు వస్తున్న మహిళలు 30 శాతం మేర పెరిగినట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రతి జిమ్‌లోనూ 40 శాతం మంది మహిళలు ఉంటున్నారు.



ఆరోగ్య సమస్యల నుంచి ఉపశమనం కోసం

అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యులు, సహచరులు సూచనలు మేరకు జిమ్‌బాట పడుతున్న మహిళల సంఖ్య అధికంగా ఉంటోంది. వీరిలో ఎక్కువగా గృహిణులు ఉంటున్నారు. పీసీవోడీ, పీసీవోఎస్, థైరాయిడ్, మైగ్రేన్, ఫ్యాటీ లివర్, బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు వంటి ఇబ్బందులతో బాధపడేవారు వాటి నుంచి ఉపశమనం పొందేందుకు జిమ్‌బాట పడుతున్నారు. నిపుణుల పర్య

జిమ్‌లో చేసే వ్యాయామంతో ఫిట్‌గా ఉండొచ్చు



జిమ్‌కు గడిచిన ఆరేళ్లుగా వెళుతున్నా. తొలుత బరువు తగ్గాలని చేరాను. బరువు తగ్గిన తరువాత కూడా వెళ్లడం మానలేదు. జిమ్‌కు వెళ్లినప్పటి నుంచి హెల్తీగా ఉంటున్నా. ప్రతిరోజూ రెండు గంటలు జిమ్‌కు కేటాయిస్తున్నా. ఉదయం నుంచి సాయంత్రం వరకు హెల్తీగా ఉండేందుకు, ఫిజికల్, మెంటల్ స్ట్రెస్ నుంచి రిలాక్స్ అయ్యేందుకు వ్యాయామం ఎంతగానో దోహదం చేస్తోంది. అదే సమయంలో పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి.

- ఎం.రమ్య, హెచ్‌ఆర్ మేనేజర్



వేక్షణలో వ్యాయామాలు చేస్తూ బరువు తగ్గడంతోపాటు ఇతర సమ స్యల నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్నారు. ఆయా సమస్యలతో బాధపడుతున్న మహిళల్లో చాలా మందికి జిమ్‌లో చేరిన నాలుగు, ఐదు నెలల్లోనే మంచి ఫలితాలు కనిపిస్తు న్నట్టు చెబుతున్నారు. గడిచిన కొన్నాళ్లుగా తాను అధిక బరువుతో బాధపడుతున్నానని, జిమ్‌లో చేరిన ఏడు నెలల్లో పది ... మిగతా 6వ పేజీలో

కోడి వ్యర్థాల కాంట్రాక్టు కోసం పట్టు

చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాల సేకరణకు జోన్‌ల వారీగా టెండర్లు పిలిచిన జీవీఎంసీ

- వాటిని కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించకుండా చేపల చెరువులకు అమ్ముకుంటున్న కాంట్రాక్టర్లు
- బాగా లాభసాటిగా ఉండడంతో ఈసారి పెరిగిన పోటీ
- తమ అనుచరులకు టెండర్ ఖరారు చేయాలని జీవీఎంసీ అధికారులకు ప్రజా ప్రతినిధులు ఫోన్లు
- ఏం చేయాలో దిక్కుతోచక నెల రోజులుగా బిడ్ తెరవని వైనం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించే కాంట్రాక్టును తమ అనుచరులకు ఇవ్వాలని జీవీఎంసీ అధికారులపై కొందరు ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు ఒత్తిడి తీసుకువస్తున్నారు. చికెన్ వ్యర్థాలను కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించేందుకు జీవీఎంసీ టెండర్లు పిలిచింది. అర్హత, ఆసక్తి కలిగిన పలువురు బిడ్‌లు దాఖలు చేశారు. అర్హత కలిగి తక్కువకు కోట్ చేసిన వారికి టెండర్ ఖరారు చేయాలని అధికారులు భావించారు. కానీ కాంట్రాక్టును తమ అనుచరులకే ఇవ్వాలంటూ నగరంతోపాటు అనకాపల్లి జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు పట్టుబడుతున్నారు. దీంతో అధికారులు తాత్కాలికంగా టెండర్లను పక్కనపెట్టారు.

నగర పరిధిలోని చికెన్/మటన్ దుకాణాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ఆరుబయట పడేస్తే ప్రజలను రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ప్రజారోగ్యం విభాగం సిబ్బంది స్వయంగా దుకాణాలకు వెళ్లి చికెన్ వ్యర్థాలను సేకరించి కాపులుప్పాడ తరలించేవారు. అయితే పారిశుధ్య నిర్వహణకు సిబ్బంది కొరత ఏర్పడుతుందనే ఉద్దేశంతో టెండర్ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ప్రారంభించింది. గత కొన్నేళ్లుగా ఇదే పద్ధతి అమలవుతోంది. రెండేసి జోన్లను ఒక యూనిట్‌గా తీసుకుని ఆయా ప్రాంతాల్లోని చికెన్ దుకాణాల నుంచి ప్రతిరోజూ వ్యర్థాలను సేకరించి, వాటిని వారి సొంత వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించేందుకు వీలుగా టెండర్లు పిలిచి తక్కువకు కోట్ చేసేవారికి పనులు అప్పగిస్తూ వస్తోంది. ఇదిలావుండగా అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల్లో చేపల చెరువులు పెరగడంతో చికెన్ వ్యర్థాలకు డిమాండ్ పెరిగింది. చికెన్ వ్యర్థాలను ఆహారంగా వేస్తే తక్కువ వ్యవధిలోనే చేపలు ఎక్కువ బరువు పెరుగుతాయని పెంపకందారులు ... మిగతా 6వ పేజీలో




చైర్మన్‌కు స్వాగతం చెబుతున్న దృశ్యం

ఏపీఈఆర్‌సీ చైర్మన్ ఠాకూర్‌సింగ్ రాక

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఇన్‌చార్జి చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా శనివారం విశాఖపట్నం క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఆయనతోపాటు ఈఆర్‌సీ సభ్యులు పీవీ రెడ్డి కూడా వచ్చారు. వీరికి జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్వాగతం పలికారు.

నెలలు నిండకుండానే...

- అవగాహనతో ప్రీమెచ్యూరిటీ ప్రసవాలకు చెక్



- నేడు ప్రీమెచ్యూరిటీ డే - 8లో

జోరుగా విమానయానం



భారీగా పెరిగిన ప్రయాణికులు

- ఢిల్లీ, హైదరాబాద్‌లకు భలే డిమాండ్
- 80 శాతానికి పైగా ఆక్యుపెన్సీ
- సింగపూర్ విమానానికి 75.22 శాతం ఆక్యుపెన్సీ
- గత ఏడాది అక్టోబరుతో పోల్చితే ఈ ఏడాది అక్టోబరులో అన్ని రకాలుగా వృద్ధి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం విమానాశ్రయం నుంచి దేశ, విదేశాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రతిరోజూ 32 సర్వీసులు అటుఇటు తిరుగుతుండగా వాటిలో ఎనిమిది వేల మంది ప్రయాణిస్తున్నారు. నెలకు ప్రయాణించే వారి సంఖ్య 2.5 లక్షలు దాటింది. ఏయే నగరాలకు వెళ్లే విమానాలు రద్దీగా ఉంటున్నాయనేది పరిశీలిస్తే...దేశ రాజధాని ఢిల్లీ అగ్రస్థానంలో ఉంది. గత అక్టోబరు నెలలో ఢిల్లీ వెళ్లే విమానాల్లో 26,692 సీట్లు అందుబాటులో ఉండగా...22,879 మంది ప్రయాణించారు. అంటే 85.71 శాతం ఆక్యుపెన్సీ ఉంది. విశాఖ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే వాటిలో ఇదే అత్యధికం కావడం గమనార్హం.

ఢిల్లీ తరువాత స్థానంలో హైదరాబాద్ నిలిచింది. అక్టోబరు నెలలో విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లే విమానాల్లో 50,383 సీట్లు అందుబాటులో ఉండగా...వాటిలో 40,632 మంది ప్రయాణించారు. ఆక్యుపెన్సీ రేటు 80.64 శాతంగా నమోదైంది. దేశ ఆర్థిక రాజధానిగా పేరొందిన ముంబై మూడో స్థానంలో నిలిచింది. ఆ నగరానికి 11,102 సీట్లు అందుబాటులో ఉండగా 8,877 సీట్లు ప్రయాణికులు వినియోగించుకున్నారు. గ్రీన్ సిటీ బెంగళూరుకు విశాఖ నుంచి 28,192 సీట్లు అందుబాటులో ఉండగా, 21,569 మంది ప్రయాణం చేశారు. ఆక్యుపెన్సీ 76.5 శాతంగా నమోదైంది. ఇక విశాఖపట్నం నుంచి చెన్నై నగరానికి 16,716 సీట్లు అందుబాటులో ఉండగా 11,791 మంది ప్రయాణించారు. ఆక్యుపెన్సీ రేటు 70.53 శాతం నమోదైంది.

విశాఖ నుంచి సింగపూర్, మలేషియా, బ్యాంకాక్‌లకు అంతర్జాతీయ విమాన సర్వీసులు ఉండగా సింగపూర్ విమానం అక్టోబరులో దేశీయ సర్వీస్‌లకు తీసిపోకుండా 75.22 శాతం ఆక్యుపెన్సీతో నడిచింది. మొత్తం 3,165 సీట్లు అందుబాటులో ఉండగా 2,381 మంది ప్రయాణించారు. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి 2023 అక్టోబరులో 2,32,004 మంది ప్రయాణం ... మిగతా 6వ పేజీలో

బడ్డీల తొలగింపులో ఉద్రిక్తత

- వందలాది మంది జీవీఎంసీ సిబ్బంది, పోలీసులు రాక
- క్రేన్‌లతో తోపుడుబండ్లు, బడ్డీలు ధ్వంసం
- చిరు వ్యాపారుల ఆగ్రహం
- కార్పొరేటర్ మూర్తియాదవ్ ఇంటి ముట్టడికి విఫలయత్నం



పితాపురంకాలనీ రోడ్డులో ధ్వంసం చేసిన బడ్డీలు



పీతల మూర్తి ఇంటి ముట్టడిని అడ్డుకుంటున్న పోలీసులు

మద్దిలపాలెం, నవంబరు 16: జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది శనివారం 22వ వార్డులో తోపుడుబండ్లు, బడ్డీల తొలగింపు సందర్భంగా ఓవరాక్షన్ చేశారు. పెద్ద పెద్ద క్రేన్లు, ట్రాలర్ లారీలు, జేసీబీలు, టిప్పర్‌లతో భీతావహ వాతావరణం సృష్టించారు. రోడ్డుపక్క దుకాణాలను తొలగించడానికి శనివారం ఉదయం ఐదు గంటలకే టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, పోలీసులు సుమారు 300 మంది శివాజీపాలెం చేరుకున్నారు. పితాపురం కాలనీ రోడ్డు నుంచి ప్రారంభించి శివాజీ పార్కు రోడ్డు వరకూ ఎక్కడా చిన్న బడ్డీ మిగలకుండా క్రేన్‌లతో తీసిపారేశారు. తోపుడుబండ్లు, చెక్క బడ్డీలు మళ్లీ వినియోగించకుండా ధ్వంసం చేశారు. కొంతమంది బడ్డీలనైతే జేసీబీల బకెట్‌లో కొట్టి పూర్తిగా నేలమట్టం చేశారు. ఈ ... మిగతా 6వ పేజీలో



వైర్లు తెగి గాల్లో వేలాడుతున్న సీసీ కెమెరా

నిఘా నేత్రంపై నిర్లక్ష్యం

సాగర్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్డు నుంచి సాగర్‌నగర్‌కు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వైర్లు తెగి గాల్లో వేలాడుతోంది. లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాల పట్ల అధికారుల వైఖరిని పలువురు విమర్శిస్తున్నారు. స్థానికంగా అల్లర్లు, అసాంఘిక శక్తులు, చోరగాళ్లను పట్టుకునేందుకు పోలీసులు వీటిని ఏర్పాటు చేశారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వీటిని ఏర్పాటు చేసినప్పటి నుంచి పని చేసిన దాఖలాలు లేవు.

అరకొర సిటీ బస్సులతో సందర్శకుల అవస్థలు

సాగర్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంత గ్రామాలైన సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం,ముసలయ్యపాలెం, రుషికొండకు సిటీ బస్సులు అరకొరగా ఉండడంతో ప్రయాణికులు, సందర్శకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాప్‌ల్లో గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. కొందరు అధిక డబ్బులు వెచ్చించి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈప్రాంతంలో రుషికొండ బీచ్, జూపార్కు, రామానాయుడు స్టూడియో, ఇస్కాన్ మందిరం, టీటీడీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఐటీ హబ్, తదితర పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వీటి సందర్శనకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. తగినన్ని బస్సులు లేకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం జాతీయ రహదారి నుంచి నడిచే కొన్ని సర్వీసులను వయా బీచ్ రోడ్డు మీదుగా నడిపితే సందర్శకులకు, స్థానికులకు సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రస్తుతం సాగర్‌నగర్ ప్రాంతానికి 52డి/జి సర్వీసు, బీచ్ రోడ్డులో భీమిలి వరకు 900కె మాత్రమే తిరుగుతున్నాయి. అధికారులు స్పందించి తీర ప్రాంతాలకు మరిన్ని బస్సు సర్వీసులు వేయాలని పలువురు కోరుతున్నారు.

దోమల వ్యాప్తితో రోగాలు

మధురవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు జీవీఎంసీ సిబ్బంది ఫాగింగ్ చేపట్టడం లేదు. ఏడాదిగా ఫాగింగ్ చేయకపోవడంతో వీధుల్లో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గతంలో మధురవాడ, పీఎంపాలెం, మల్లయ్యపాలెం, నగరంపాలెం, పోర్టు కాలనీ, వాంబే కాలనీ, స్వతంత్ర నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నెలకు కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసి జీవీఎంసీ ఆధ్వర్యంలో ఫాగింగ్ చేసేవారు. దీనివల్ల దోమల బెడద కొంతవరకు తగ్గేది. ఏడాదిగా ఈ ప్రక్రియ నిలిచిపోవడంతో వార్డుల్లో దోమల బెడద తీవ్రంగా ఉంది. మరోవైపు కాలువల్లో దోమల లార్వా నశింపచేసే మందులు కూడా వెదజల్లడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ ప్రజారోగ్య శాఖాధికారులు తక్షణమే స్పందించి ఫాగింగ్ ప్రక్రియ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'మానసిక వికలాంగులకు అండగా ఉంటాం'

కొమ్మాది, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మానసిక వైకల్యం కలిగిన పిల్లలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని షారోన్ స్పెషల్ స్కూల్ డైరెక్టర్ శైలో శాస్త్రి అన్నారు.శనివారం ఆయన పీఎంపాలెంలో ఉన్న మానసిక వికలాంగ పాఠశాలకు చెందిన పిల్లలను జూపార్క్‌కు పిక్నిక్‌కు తీసుకువెళ్లారు.వారికి వివిధ రకాల జంతువులను చూపించి, వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జూ క్యూరేటర్ బి. గోపి, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ భారతి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం

భీమునిపట్నం,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చంద్రశేఖర్, రచయిత వర్మ మాట్లాడుతూ కథ, పఠనంపై ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ప్రకాశ్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం : ఎంపీడీఓ

పద్మనాభం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో కూడిన విద్యతో విద్యార్థులు ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దబడతారని ఎంపీడీఓ ఎం. విజయకుమార్ చెప్పారు. శనివారం ఆయన కుర్రపల్లిలో ఎస్‌ఓఎస్ కుటుంబ బలోపేతం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌ఓఎస్ వంటి సంస్థలు పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం 84 మంది పిల్లలకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రావణి, విభూలా, యానిమేటర్ జానకి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆనందపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి భాస్కరరావు హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఆయన పెద్దిపాలెం గ్రామంలో రైస్ మిల్లుపై దాడి చేసి మూడు టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఆయనతో పాటు డీటీ శ్రీనివాసరావు, ఆర్‌ఐ రామకృష్ణ, ఏఎస్‌ఓ కల్యాణి ఉన్నారు.



రెల్లి వీధిలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్



సెప్టిక్ ట్యాంక్ వెనుక నిలిచిన మురుగు



టాయిలెట్ వెనుకభాగంలో పాడైన పైపులు

దుర్గంధం

- నిర్వహణ లోపంతో రెల్లివీధిలో సామూహిక మరుగుదొడ్లు
- రన్నింగ్ వాటర్ సదుపాయం లేక వినియోగానికి దూరం
- ఫిర్యాదు చేసినా.. పట్టించుకోని అధికారులు

భీమునిపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రెల్లివీధిలో వున్న సామూహిక మరుగుదొడ్లు నిర్వహణ లోపం వల్ల నరక కూపంగా మారాయి. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి గంటా శ్రీనివాసరావు జీవీఎంసీ నిధులతో వీటిని ఏర్పాటు చేయించారు. రన్నింగ్ వాటర్‌కు బోర్‌వెల్, ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఫైబర్ టాయిలెట్ కావడంతో నిర్వహణ లోపం వల్ల అనతి కాలంలోనే పాడైంది. పైపులన్నీ విరిగిపోయాయి. కమోడ్‌లు పాడయ్యాయి. తలుపులు చెదలు పట్టాయి. రన్నింగ్ వాటర్‌కు ఏర్పాటు చేసిన మోటారు మరమ్మతుతో మూలకు చేరింది. మహిళలు ప్రతి ఇంటికి రూ.20 చొప్పున విరాళాలు వేసుకుని బోరు బాగు చేయడం, టాయిలెట్లను శుభ్రం చేయడం చేసుకుంటున్నారు. సెప్టిక్ ట్యాంక్ నిండిపోవడం, విరిగిన పైపులతో మురుగు అంతా బయటే కొలనులా ఉండిపోయింది. దీంతో విపరీతమైన దుర్వాసన వస్తుండడంతో మహిళలు నరకయాతన అనుభవిస్తున్నారు.కమోడంతా మురుగు నిండిపోవడంతో రోగాలు వస్తాయేమోనని భయపడుతున్నారు. ఈవిషయమై వార్డు సచివాలయం శానిటరీ సెక్రటరీ శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ వద్ద ప్రస్తావించగా పరిశీలించామని, ఎమ్మెల్యే గంటా దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ టాయిలెట్‌లను తొలగించి, కొత్తగా సులాబ్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్టు చెప్పారు.

తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ

కొమ్మాది, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 5వ వార్డు కొండవాలు ప్రాంతాలైన స్వయంకృషినగర్, వికలాంగుల కాలనీ, కార్పెంటర్స్ కాలనీ ప్రాంతాలకు రూ. 60లక్షలతో చేపట్టనున్న తాగునీటి పైపులైన్ నిర్మాణానికి కార్పొరేటర్ మొల్లి హేమలత శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండవాలు ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా తాగునీటి పైపులైన్ల కోసం ఎదురుచూస్తున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడంతో సమస్య పరిష్కారమైందని చెప్పారు. పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, వార్డు జనసేన అధ్యక్షుడు దేవర శివ, తెలుగు యువత అధ్యక్షుడు కొండపురాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సింహాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అడివివరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసి గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య, రంగనాథన్ చిత్రపటాలకు పలువురు పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం గ్రంథాలయాల వార్షికోత్సవాల్లో భాగంగా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నేత సూర్యనారాయణ, గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం, కె. సురేశ్, న్యాయవాది కె. రామకృష్ణ తదితరలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మత్స్యకారుల రిలే దీక్షలు



రిలే దీక్షలో పాల్గొన్న మత్స్యకారులు

భీమునిపట్నం,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని జోనల్ కార్యాలయం వద్ద మత్స్యకారులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా మత్స్యకార నాయకుడు, గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు మాట్లాడుతూ ఒకవైపు ఆక్రమణలు, మరోవైపు రసాయనిక పరిశ్రమల వ్యర్థాలతో తీరానికి నష్టం జరుగుతున్నా..ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. అభివృద్ధి పేరుతో మత్స్యకారులు తీరంలో జీవించే హక్కును కాలరాస్తుండడం సరికాదని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ రిలే దీక్ష కొనసాగుతుందన్నారు. కాగా మదర్ కళాశాల ప్రిన్సిపాల్ చీకటి రమేశ్ శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి'

పద్మనాభం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని లైఫ్ స్కిల్స్ ట్రైనర్ జరజాపు సురేశ్ కుమార్ చెప్పారు. శనివారం ఆయన రెడ్డిపల్లి, మద్ది, పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమయం ఎంతో విలువైనదని, దాన్ని సద్వినియోగం చేసుకొని విద్యా ప్రావీణ్యతను సంపాదించాలన్నారు. చదువు పూర్తయిన తరువాత వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు సన్యాసిరావు, ప్రసూన, భీమిలి స్వచ్ఛంద సేవకుడు సంకురుభక్త జోగారావు, తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేస్తున్న భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

మరో పది ఎకరాలు స్వాధీనం

సింహాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం భూములకు సంబంధించి హైకోర్టులో దాఖలు చేసిన పలు కేసులను కొట్టివేయడంతో దేవస్థానానికి మరో పది ఎకరాల భూమి దక్కిందని ఈఓ త్రినాథరావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అడివివరం గ్రామ సర్వే నంబరు 275లో సీతమ్మధార ప్రాంతంలో సుమారు పది ఎకరాలు, అదే సర్వే నంబరులో మరో ప్రాంతంలో 4460 చదరపు గజాల భూమిపై ఉన్న కేసుల్లో హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. శనివారం ఆయా భూములను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని చెప్పారు.దేవుడి భూములను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం భూ పరిరక్షణ విభాగం ఎస్‌టీసీ గీతాంజలి, ప్రత్యేక ప్యానల్ న్యాయవాది ప్రసాద్, సహాయ కార్యనిర్వాహణాధికారి రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు సహస్రనామ తులసీ దళార్చన



సింహాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సహస్రనామ తులసీ దళార్చన శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

సాగర తీరంలో 'వెన్నెల్లో హాయ్..హాయ్'



కార్యక్రమంలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు, వృద్ధులు

భీమునిపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గోస్తనీ సాగర సంగమం ప్రదేశంలో సీనియర్ సిటిజన్లు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు నిర్వహించిన వెన్నెల్లో హాయ్..హాయ్ కార్యక్రమం ఆకట్టుకుంది. స్థానిక సీనియర్ సిటిజన్లు, టెన్నిస్ క్లబ్, ఫ్రెండ్స్ అసోసియేషన్, ఫోరం ఫర్ బెటర్ భీమిలి తదితర సంస్థల సభ్యులు తెల్లటి దుస్తులు ధరించి, కార్యక్రమానికి హాజరయ్యారు. వారికి నిర్వాహకులు కర్పూర దండలతో ఆహ్వానం పలికారు. సీనియర్ సిటిజన్లకు కుర్చీలతో పాటు మంచాలు ఏర్పాటు చేయడంతో ఆట, పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ స్నేహభావాన్ని పెంపొందించేందుకు, వృద్ధుల్లో ఆనందం నింపేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

నేడు హోమియో వైద్య శిబిరం

భీమునిపట్నం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిన్నబజారు డచ్ వీధిలో ఉన్న కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ చైర్మన్ కె. శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 మధ్యాహ్నం 1.30 గంటల వరకూ ఈ శిబిరం జరుగుతుందన్నారు. వైద్యులు రోగులను పరీక్షించి, అవసరమైన మందులు ఉచితంగా అందిస్తారని చెప్పారు.

నారీమణుల జిమ్ బాట

... 5వ పేజీ తరువాయి

కిలోల వరకు బరువు తగ్గినట్టు జ్యోత్స్న అనే ఆమె చెప్పారు. జిమ్‌కు వస్తున్న ప్రతి వంద మంది మహిళల్లో 30 మంది విద్యార్థినులు, మరో 30 మంది గృహిణులు, మరో 30 మంది వరకు ఉద్యోగినులు ఉంటుండగా, పది మంది పదేళ్లలోపు బాలికలు ఉంటున్నారు. బాలికలు స్పోర్ట్స్ కోసం జిమ్‌లో చేరి శరీర ఆకృతిని మార్చుకుంటున్నారు. నగరంలో జిమ్‌ను బట్టి నెలకు రూ.1500 నుంచి రూ.2500 వరకూ ఫీజు తీసుకుంటున్నారు. మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాది ప్యాకేజీలు కూడా ఉంటాయి. జిమ్‌లో చేరే మహిళలు తప్పనిసరిగా రోజుకు కనీసం రెండు గంటలు సమయాన్ని కేటాయించాల్సి ఉంటుంది.

ఇవీ వర్కౌట్స్..

మహిళల సమస్యలు, అవసరాలను బట్టి వర్కౌట్స్ చేయిస్తామని ట్రైనర్స్ చెబుతున్నారు. ఎక్కువగా స్ట్రెంత్ ట్రైనింగ్, హీట్ వర్కవుట్స్, బాడీ టోనింగ్, ఫ్యాట్ లాస్, వెయిట్ లాస్/గెయిన్ వర్కౌట్స్ చేయిస్తుంటారు. జిమ్‌లో చేరే మహిళలు తప్పనిసరిగా డైట్ కూడా ఫాలో కావాల్సి ఉంటుంది. పర్సనల్ ట్రైనర్స్ డైట్‌కు సంబంధించి మెనూ చెబుతారు. ఒకవైపు వర్కౌట్స్ చేస్తూనే డైట్ పాటించడం వల్ల అనుకున్న లక్ష్యాలను చేరడానికి అవకాశం ఉంటుంది.

కళకళలాడుతున్న జిమ్‌లు..

ఒకప్పుడు జిమ్‌లు పురుషులపైనే ఆధారపడి ఉండేవి. ఇప్పుడు మహిళలు కూడా భారీగా వస్తుండడంతో అందుకు అనుగుణంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటు న్నారు. కొన్నిచోట్ల ప్రత్యేకంగా మహిళల కోసం జిమ్స్‌లు నిర్వహిస్తున్నారు. మహిళల కోసం ఫిట్‌నెస్ ట్రైనర్స్‌ను నిర్వాహకులు నియమించుకుంటున్నారు. కొన్నిచోట్ల పురుష ట్రైనర్సే మహిళలతో వర్కౌట్లు చేయిస్తుంటారు. ఒకప్పుడు జిమ్ అంటే ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే తెరిచి ఉండేది. ఇప్పుడు 24 గంటలు రన్ చేస్తున్నారు. మహిళలు ఎప్పుడు కావాలంటే అప్పుడు జిమ్ చేసుకునే వెసులుబాటును నిర్వాహకుల కల్పిస్తు న్నారు.

మహిళలు సంఖ్య గణనీయంగా పెరిగింది

- ఎల్.మోహనరావు, ఫిట్ ట్రైనర్, మారుతీ జిమ్ అధినేత, అక్కయ్యపాలెం



గతంతో పోలిస్తే జిమ్‌కు వస్తున్న మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. గడిచిన మూడేళ్లలో 20 నుంచి 30 శాతం మంది మహిళలు జిమ్‌కు వస్తున్నారు. మహిళల్లో ఆరోగ్యం పట్ల పెరిగిన శ్రద్ధ, ఫిట్‌గా ఉండాలన్న ఆకాంక్ష ఇందుకు కారణమవుతున్నాయి. రోజువారీ కొన్ని వర్కౌట్స్ చేయడం ద్వారా బరువు తగ్గడంతో పాటు ఫిట్‌గా మారవచ్చు. ఇందుకోసం కనీసం రెండు గంటలు సమయాన్ని కేటాయించాల్సి ఉంటుంది. జిమ్‌లో కష్టపడడంతో పాటు డైట్ విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అప్పుడే మెరుగైన ఫలితాలు వస్తుంటాయి.

జోరుగా విమానయానం

... 5వ పేజీ తరువాయి

చేయగా, ఈ ఏడాది అక్టోబరులో 2,52,499 మంది (8.83 శాతం ఎక్కువ) రాకపోకలు సాగించారు.విమానాల లెక్కలు పరిశీలిస్తే గత ఏడాది అక్టోబరులో విశాఖ నుంచి 1,732 విమానాలు నడవగా, ఈ ఏడాది అక్టోబరులో 1,855 విమానాలు నడిచాయి. 7.1 శాతం వృద్ధి నమోదైంది.

వింటర్ షెడ్యూల్‌లో మరో మూడు సర్వీస్‌లు

- రాజారెడ్డి, విమానాశ్రయం డైరెక్టర్

అక్టోబరు 28వ తేదీ నుంచి కొత్త వింటర్ షెడ్యూల్ అమలులోకి వచ్చింది. అంతకు ముందు రోజుకు 32 విమానాలు అందుబాటులో ఉండగా, ఇప్పుడు మరో మూడు పెరిగాయి. అంటే ఇటు నుంచి వెళ్లేవి 35 అయితే, అటు నుంచి వచ్చేవి మరో 35. రోజుకు 70 విమానాల కింద లెక్క. ప్రయాణికుల సంఖ్య కూడా దానికి తగ్గట్టుగానే పెరుగుతోంది.

పద్మనాభంలో 'ఉల్లాస్' సమావేశం

పద్మనాభం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ అక్షరాస్యులు కావాలని ఎంపీపీ రాంబాబు చెప్పారు. మండల వెలుగు కార్యాలయంలో స్వచ్ఛంద ఉపాధ్యాయులకు నిర్వహించిన ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. డ్వాక్రా మహిళల్లో అక్షరాస్యత శాతం పెంపొందించాలన్నారు. మహిళలకు అన్ని విషయాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయకుమార్, ఏఓ జయ ఉమ, ఏపీఎం రమేశ్ పాల్గొన్నారు.



మొక్క నాటి ఉత్సవాలను ప్రారంభిస్తున్న టీసీఆర్ అండ్ టీఎం ఈడీ రాణిమంద, తదితరులు

గిరిజన స్వాభిమాన ఉత్సవాలు ప్రారంభం

సాగర్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :రుషికొండలో ఉన్న గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ (టీసీఆర్ అండ్ టీఎం)లో గిరిజన స్వాభిమాన ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమంద తొలుత కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈనెల 26 వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా రుషికొండ, ఆర్‌కే బీచ్‌లో కార్నివాల్, గిరిజన హస్తకళ ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

భారీ వేతనంతో గీతం విద్యార్థులకు ఉద్యోగాలు

సాగర్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలో కొద్ది రోజులుగా జరుగుతున్న క్యాంపస్ ఇంటర్వ్యూల్లో స్కూల్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులకు భారీ వేతనాలతో ఉద్యోగాలు లభించినట్టు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ ఎస్. వంశీ కిరణ్ సోమయాజుల తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రముఖ సంస్థ నేపాల్ గీతం విద్యార్థికి రూ. 36 లక్షల వార్షిక వేతనం ప్రకటించగా మరో సంస్థ జేపీ మెర్గాన్ రూ. 19 లక్షల వార్షిక వేతనాన్ని, డార్విన్ బాక్స్ రూ.16 లక్షల వార్షిక వేతనాన్ని ప్రకటించాయని తెలిపారు. స్టేట్ స్ట్రీట్ కార్పొరేషన్, డెల్లాయిట్, మూసిగ్మా, బోష్, మైక్రాన్, తేజాస్ నెట్‌వర్క్, ప్రిన్సిపల్ గ్లోబల్ సర్వీసెస్, సింక్రోని, యాక్సెంచూర్ నిర్వహించిన నియామకాల్లో ఇప్పటివరకు 300 మంది ఎంపికయ్యారని చెప్పారు. ఒక్క యాక్సెంచూర్ కంపెనీలోనే 177 మందికి ఉద్యో గాలు వచ్చాయన్నారు. ఎంపికైన వారిని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్ , జీసీజీసీ విభాగం అధిపతి ప్రొఫెసర్ కేవీ ఉమాదేవి, డాక్టర్ రోజీనా మాథ్యూ, వెంకటేష్ అభినందించారు.

'నీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తమవ్వండి'

పద్మనాభం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు నాయకులు సమాయత్తం కావాలని భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్లెపాటి పెద ఎర్నినాయుడు పిలుపునిచ్చారు. ఎన్నికల సన్నహాలపై శనివారం ఆయన అనంతవరం గ్రామంలో నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. నోటిఫికేషన్ విడుదలైన వెంటనే రైతులతో సమావేశం నిర్వహించి, కూటమికి మద్దతు తెలిపేలా క్షేత్రస్థాయిలో ప్రణాళికలు రూపకల్పన చేయాలని సూచించారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన ఓటర్ల జాబితాలను పరిశీలించారు. ఈ సమావేశంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేశ్ కుమార్, మద్ది, పెంట, కొవ్వాడ. పాండ్రంగి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి

సింహాచలం,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామిని కేంద్ర ప్రభు త్వ కార్యదర్శి (ఆర్థిక సలహాదారు) సుగతా ఘోష్ దస్తీదార్ శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పర్యవేక్షణాధికారి ప్రసాద్ అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి సన్నిధిలో పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

బడ్డీల తొలగింపులో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

బడ్డీల తొలగింపునకు జీవీఎంసీ అధికారులు వంద మంది కూలీలను తీసుకుని రావడం విశేషం. వారంతా బడ్డీలు ధ్వంసం చేస్తుంటే అక్కడకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు తాళ్లతో రక్షణ వలయం తయారుచేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈప్రక్రియ కొనసాగించి సుమారు 300 దుకాణాలను తొలగించారు. దీంతో వార్డులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చిరు వర్తకులు ఆగ్రహంతో తొలగింపును అడ్డుకోవడానికి యత్నించారు. అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. అవే తమకు బతుకుదెరువని, బడ్డీలు తీయొద్దని మొరపెట్టుకున్నారు. అయితే వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి హైకోర్టులో కేసు వేశారని, ఆక్రమణలు తొలగించాలని న్యాయస్థానం ఆదేశాలిచ్చిందని అందుకే తొలగిస్తున్నామని జీవీఎంసీ అధికారులు సమాధానమిచ్చారు. దీంతో బాధితులు పెద్దఎత్తున మూర్తియాదవ్ ఇంటిని ముట్టడించడానికి ర్యాలీగా బయలుదేరారు. వారు మూర్తి యాదవ్ ఇంటి వద్దకు చేరుకోగా అక్కడ భారీగా మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. ఇంటిని ముట్టడిస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. దీంతో మూర్తి యాదవ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బాధితులు వార్డులో ర్యాలీ చేశారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

22వ వార్డులో స్ట్రీట్ వెండర్స్ యాక్ట్‌కు విరుద్ధంగా రోడ్డు మార్జిన్ దాటి జరిగిన ఆక్రమణలపై జీవీఎంసీ చర్యలు తీసుకోవడం లేదని కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలు చేశారు. ఆయన పిల్ మేరకు హైకోర్టు జీవీఎంసీకి నోటీసులు జారీచేసింది. హైకోర్టు నోటీసులకు జీవీఎంసీ అధికారులు కౌంటర్ దాఖలు చేయలేదు. దీంతో స్ట్రీట్ వెండర్స్ యాక్ట్‌కు లోబడి రోడ్డు మార్జిన్ దాటిన ఆక్రమణలు మాత్రమే తొలగించాలని మే 10న హైకోర్టు ఆదేశాలిచ్చింది. అయితే నగరంలో స్ట్రీట్ వెండర్స్ యాక్ట్ అమలులోనే లేదు. ఈ యాక్ట్ ప్రకారం వీధి వ్యాపారులకు హాకర్స్ జోన్ ఏర్పాటుచేయాలి. రోడ్డు వెడల్పు ఆధారంగా తెలుపు సున్నంతో మార్జిన్ గీతలు గీసి అందులోనే వ్యాపారాలు చేసు కోవలసిందిగా సూచించాలి. జీవీఎంసీ వీధివ్యాపారులకు గుర్తింపు కార్డులిచ్చి వ్యాపార రక్షణ కల్పించాలి. ఇవేమీ 22వ వార్డులో అమలులో లేకపోయినా మార్జిన్ దాటిన ఆక్రమణలు మాత్రమే తొలగించాలని హైకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి మరీ మొత్తం శివాజీపాలెం, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెంలో ఎక్కడా ఒక్క దుకాణం లేకుండా పూర్తిగా తొలగించారు.

కోడి వ్యర్థాల కాంట్రాక్టు కోసం పట్టు

... 5వ పేజీ తరువాయి

వాటి కోసం పోటీపడడం మొదలెట్టారు. ఇది నగరంలో చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించే కాంట్రాక్టు పొందినవారికి వరంగా మారింది. కాపులుప్పాడలోని యార్డుకు తరలించకుండా, జీవీఎంసీ అధికారులను మేనేజ్ చేసుకుని వ్యర్థాలను నేరుగా చేపల చెరువులకు తరలించడం ప్రారంభించారు. దీనివల్ల చికెన్ వ్యర్థాలను సేకరించే కాంట్రాక్టర్లకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. చికెన్ వ్యర్థాలను సేకరించేందుకు జీవీఎంసీ అప్పగించిన కాంట్రాక్టు గడువు ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగియడంతో కొత్తగా టెండర్లు పిలవాలని నిర్ణయించింది. ఆగస్టులో జోన్‌ల వారీగా ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు పిలిచింది. సెప్టెంబరు ఆరున టెండర్లు తెరిచి అర్హులైన వారికి పనులు అప్పగిస్తామని నోటీసులో పేర్కొంది. అయితే టెండర్ నోటిఫికేషన్ విషయం తమకు తెలియలేదు కాబట్టి, గడువు పెంచాలంటూ కొంతమంది కార్పొరేటర్లు జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. దీంతో అక్టోబరు ఐదు వరకూ టెండరు దాఖలుకు అవకాశం కల్పించారు. ఆరున టెండర్లు తెరుస్తామని ప్రకటించారు.

ప్రజా ప్రతినిధుల జోక్యంతో ఆగిన ప్రక్రియ

కోడి వ్యర్థాల సేకరణ కాంట్రాక్టు దక్కితే భారీగా సంపాదించవచ్చునని భావించి టెండర్‌లో పాల్గొన్నవారు కొందరు నగరంతోపాటు అనకాపల్లి జిల్లాలో తమకు తెలిసిన నేతలను కలిసి తమకు దక్కేలా చూడాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతో ప్రజా ప్రతినిధులు జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి చికెన్ వ్యర్థాల కాంట్రాక్టు తాము సూచించిన వారికి వచ్చేలా చూడాలని ఆదేశిస్తున్నారు. నగరానికి చెందిన ఇద్దరు ప్రజా ప్రతినిధులు, మరొక మాజీ ప్రతినిధి నేరుగా సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి తాము చెప్పినవారికి కనీసం ఒక్కో జోన్ కాంట్రాక్టు దక్కేలా చూడాలని ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది. రూరల్ జిల్లాకు చెందిన మరో ప్రజా ప్రతినిధి కూడా జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి చాలాకాలంగా పార్టీ కోసం పనిచేసిన వ్యక్తి చికెన్‌వ్యర్థాల సేకరణకు టెండర్ వేశారని, కచ్చితంగా ఒక జోన్ ఆయనకు ఇప్పించాల్సిందేనని చెప్పినట్టు సమాచారం. అయితే నిబంధనలకు విరుద్ధంగా టెండర్ ఖరారు చేస్తే తాము ఇబ్బంది పడాల్సి వస్తుందని అధికారులు భయపడుతున్నారు. అందుకే గత నెల ఆరున తెరవాల్సిన టెండర్లను ఇంతవరకూ తెరవకుండా పక్కనపెట్టేశారు. ఈ విషయం ఒక అధికారి వద్ద ప్రస్తావించగా, ఉన్నతస్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయని, ఏం చేయాలో దిక్కుతోచక ముందుకు వెళ్లడం లేదని సమాధానం ఇచ్చారు.

రూ.లక్షల వ్యయం.. సమస్య యథాతథం

- 'ముడసర్లోవ'లోకి మురుగు ప్రవాహం
- కొండల పై నుంచి వస్తున్న నీటిలో కలుస్తున్న కలుషిత నీరు
- రూ.లక్షలు వెచ్చించి గోడ కట్టినా ఫలిత శూన్యం
- ఇంజనీరింగ్ అధికారుల నిర్వాకంతో ప్రజా ధనం వృథా


ముడసర్లోవ రిజర్వాయరుకు వెళుతున్న గెడ్డ నీరు


ముడసర్లోవ రిజర్వాయర్‌లో చేరుతున్న మురుగు

ఆరిలోవ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొండలపై వర్షం పడినప్పుడు ఆ నీరు రామకృష్ణాపురం గెడ్డలోకి చేరి అక్కడ నుంచి ముడసర్లోవ రిజర్వాయర్‌కు చేరుతుంది. అయితే ఈ మధ్యలో రామకృష్ణాపురం గ్రామస్థులు, కేంద్ర కారాగారం నుంచి వాడుక నీరు ఈ ప్రవాహ నీటిలో కలిసి కలుషితం అవుతోంది. తర్వాత ఈ మురుగునీరు ముడసర్లోవ రిజర్వాయర్‌లో కలుస్తోంది.

రామకృష్ణాపురం, కేంద్ర కారాగారం నుంచే వచ్చే మురుగు నీరు వేరే చేయడానికి గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి సిమెంట్ కాంక్రీట్ పనులు చేశారు. అయితే మురుగునీరు ముడసర్లోవ రిజర్వాయర్‌కు వెళ్లకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. ఏదో పని అయిందనిపించామన్నట్టుగా రెండు నీటి పాయల మధ్య ఓ సన్నని గోడ కట్టి వదిలేశారు. దీంతో సమస్య పరిష్కారం కాలేదు. ఇక్కడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి సూయిజ్‌ప్లాంటుకు అనుసంధానం చేసినట్టయితే ఈ నీరు కలుషితం కాకుండా ఉండేది. కానీ అధికారులు అనాలోచితంగా ప్రజాధనాన్ని వృథా చేయడం మినహా ఉపయోగకరంగా పనులు చేపట్టలేకపోయారన్న విమర్శలు ఉన్నాయి. కొండల పై నుంచి వచ్చే నీరులో ఎలాంటి మురుగునీరు కలవకుండా ముడసర్లోవ రిజర్వాయర్‌లో కలిసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కొన్నాళ్లకు రిజర్వాయర్ ప్రక్షాళన చేపట్టాల్సిన పరిస్థితి ఎదురవుతుందని పలువురు అంటున్నారు. ప్రస్తుతం ముడసర్లోవ రిజర్వాయర్ నుంచి తాగునీటి అవసరాల కోసం ఆరిలోవ, పెదగదిలి ప్రాంతాల వారికి సరఫరా చేస్తున్నారు. ఇది కాస్తా కలుషితం కావడంతో ఎప్పుడు ఏ వ్యాధులు సంభవిస్తాయోనని ఆయా ప్రాంతాల వాసులు ఆందోళన చెందుతున్నారు. అలాంటి విపత్కరమేదో సంభవించక ముందే అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

☛ సంక్షిప్తంగా..

అలరించిన గాత్ర కచేరీ


కచేరీ నిర్వహిస్తున్న శ్రీనివాసరాజారావు

మద్దిలపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన గాత్ర కచేరీ అలరించింది. ముత్తుస్వామి దీక్షితర్ వర్థంతి సందర్భంగా త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ నిర్వహించిన కచేరిలో అకోండి శ్రీనివాసరాజారావు అద్భుత గానంతో శ్రోతలను మైమరిపించారు. రూపక తాళంలో సిద్ధివినాయకం షణ్ముఖప్రియ గానం అందర్నీ ఆకట్టుకుంది. పార్వతిపతిం, వారాహిం, ఏకామ్రేశనాయికం, పురహరనందన గానాలు ఆలపించి కళాభిమానులను మంత్రముగ్దులను చేశారు. వయోలిన్‌పై లక్ష్మీగణపతిశర్మ, మృదంగంపై ఎస్.సుబ్రమణ్యం సహకారం అందించారు. కార్యక్రమంలో కళాభారతి నిర్వహకులు రాంబాబు, మంతెన సత్యనారాయణ పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ లెక్కింపు


పర్యవేక్షిస్తున్న ఈవో శిరీష, టీఆర్ చోళన్

సిరిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీసంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించినట్టు ఆలయ ఈవో కె.శిరీష, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. గత 28 రోజులకు రూ.17,98,346, బంగారం 3 గ్రాముల 027 మిల్లీ గ్రాములు, సిల్వర్ 0-101-100 మిల్లీ గ్రాములు, యూఎస్‌ఏ డాలర్ 20, యూఏఈ డెర్హామ్స్ 10, రెండు ఎస్‌బీఐ చెక్కు రూ.111, ఎస్‌బీఐ చెక్కు రూ.111 ద్వారా వచ్చాయని వెల్లడించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ హుండీల సూపర్‌వైజర్ ఎం.శ్రీధర్, శివజ్యోతి సేవా సంఘం, యూనియన్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

ఆరిలోవ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 12వ వార్డులోని 24, 26 పోలింగ్ బూత్‌ల పరిధిలో శనివారం చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకుంటే బీమా సదుపాయంతో పాటు అనేక విధాలుగా పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీవార్డు అధ్యక్షుడు గాడి సత్యంతో పాటు స్థానికనేతలు, కార్యకర్తలుపాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడీ, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో:** లిఖిత (శ్రీహరిపురం)
- **క:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :**రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు)56, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 28, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 30, క్యారెట్ 62 దొండకాయలు 30, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 50, కీర దోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

డిమాండ్ల సాధనకు పెన్షనర్ల ధర్నా


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

సిరిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎవరి దయాదాక్షిణ్యాలపై తాము జీవించడం లేదని, డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని పెన్షన్‌దారులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ పెన్షన్ తమ హక్కు అని భావించి పెన్షన్‌దారులందరూ ఉద్యమించడం ద్వారా ప్రభుత్వం దిగివస్తుందన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ఇవ్వడానికి అనేక ఆటంకాలు సృష్టించడం దుర్మార్గమన్నారు. పెన్షనర్లకు మొండి చెయ్యి చూపడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగాల్లో పని చేసే ఉద్యోగులకు పీఎఫ్, మేనేజ్‌మెంట్ వాటా ఇవ్వాలని కొత్తగా ఈపీఎఫ్ తీసుకొచ్చి మేనేజ్‌మెంట్ వాటా ఎగ్గొట్టారని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలు నడిపే బ్యాంకుల్లో ఇన్సూరెన్స్ డీపీడీ ఉంటుందని, సంక్షేమం ఉండదన్నారు. ఏపీఆర్‌పీఏ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలన్నారు. మినిమమ్ పెన్షన్ రూ.9 వేలు అమలు ఏయాలని కోరారు. ఈపీఎస్ 95 పెన్షన్‌కు ఇతర పెన్షనర్స్ వలె కరువుభత్యం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యూవీఎస్ఎన్ వర్మ, ఎం.రామారావు, కె.సుధాకర్, కె.దీనబంధు, బాబూరావు, అప్పారావు, పెన్షనర్స్ రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఏయూలో స్వచ్ఛత హీ సేవ


స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ జాతీయ సేవా పథకం యూనిట్-2 ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని ఏయూలోని కేంద్రీయ గ్రంథాలయం, కాన్వొకేషన్ హాలు వద్ద నిర్వహించారు. లైబ్రరీ వెనుక భాగంలో ఉన్న చెట్ల పొదలను పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం కాన్వొకేషన్ హాలు, లైబ్రరీకి మధ్యలో ఉన్న పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్త, ముళ్లపొదలను పూర్తిగా తొలగించారు. ఈ కార్యక్రమాన్ని కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు ఆదేశాల మేరకు జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్, ఎంఏ సోషియాలజీ, ఎంఏ హిందీ, ఎంఏ సోషల్ వర్క్ విద్యార్థి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

జాతీయ సాహస శిక్షణా శిబిరానికి ఏయూ విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ

వెంకోజీపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏయూ జాతీయ సేవా పథకానికి చెందిన పదిమంది విద్యార్థులు జాతీయ సాహస శిక్షణా శిబిరానికి ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు హిమచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో జరిగే శిక్షణ కార్యక్రమానికి వీరు హాజరవుతారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు అభినందించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ పల్లవి పాల్గొంటారు.

బోరువెల్స్ ప్రారంభం


బోరువెల్ ప్రారంభిస్తున్న రామలక్ష్మి

ఆరిలోవ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు లేని ప్రాంతంగా 10వ వార్డును తీర్చిదిద్దుతానని స్థానిక కార్పొరేటర్ మద్ది రామలక్ష్మి అన్నారు. శనివారం ఆమె వార్డులోని బీఎస్ నగర్ కొండవాలు ప్రాంతం, రవీంద్రనగర్‌లో తాగునీటి బోరువెల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు, గ్రామ పెద్దలు, జనసేన, బీజేపీ స్థానిక నేతలు పాల్గొన్నారు.

'టిడ్కో'ను పైశాచిక ఆనందానికి పరాకాష్ఠగా మార్చేశారు

- వైసీపీ హయాంలో తీరుపై అసెంబ్లీలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు విసుర్లు



వెంకోజీపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో హౌసింగ్ అనేది మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పైశాచిక ఆనందానికి పరాకాష్ఠగా మార్చేశారని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు విమర్శించారు. శనివారం అసెంబ్లీలో టిడ్కో నివాసాలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ విశాఖలో 2014-19 సమయంలో అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వాలని అప్పటి సీఎం చంద్రబాబు హయాంలో యూసీడీ సిబ్బంది ద్వారా ఇంటింటికి సర్వే చేసి, 1.20 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించారన్నారు. పి-1, పి-2, పి-3 రూపంలో జాబితాను సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపించారని, దీంతో కేంద్ర ప్రభుత్వం విశాఖకు అత్యధికంగా లక్షకు పైగా ఇళ్లు మంజూరు చేసిందన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో గతంలో సిద్ధం చేసిన జాబితాను పక్కన పెట్టి, సొంత జాబితాను రూపొందించి తమ అనుకున్న వాళ్లకు మాత్రమే ఇళ్లు కేటాయించిందని ఎమ్మెల్యే ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లు విశాఖకు 24,192 మంజూరు చేస్తే, తూర్పు నియోజకవర్గానికి 3354 మంది లబ్ధిదారులకు కేటాయించారన్నారు. వీటిలో దబ్బందలో 1920 మంజూరు చేయగా, 1500 మంది లబ్ధిదారులకు, సంగివలస ప్రాంతంలో 10 బ్లాక్‌ల్లో 480 ఇళ్లు నిర్మించగా, తూర్పు నియోజకవర్గానికి 479 ఇళ్లు మంజూరు చేసి, వాటిలో 316 మంది లబ్ధిదారులకు కేటాయించారన్నారు. అయితే ఇప్పటి వరకు 9 బ్లాక్‌లు ఇంకా పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదన్నారు. అయితే ఇళ్లు కేటాయించామని, లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారని, బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి, వాటిని అప్పటి ప్రభుత్వం వాడుకుందని ఆరోపించారు. ఇప్పటి వరకు ఇళ్లు ఇవ్వకపోవడంతో బ్యాంకు అధికారులు నెలవారి వాయిదాలను చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అలాగే అందరికీ ఇళ్లు పేరిట లబ్ధిదారులు చాలా మంది డీడీలు చెల్లించారన్నారు. వారిలో నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వలేదని, నాలుగేళ్లుగా డీడీల మొత్తాన్ని కూడా వెనక్కి ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. జీవీఎంసీ యూసీడీ అధికారులైతే డీడీలు బ్యాంకుల్లో జమ చేయకుండా బీరువాల్లో దాచి ఉంచారని ఆరోపించారు. నాటి యూసీడీ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయమై కోర్టు ఆశ్రయించినా, కోర్టు తీర్పు ఇచ్చినా సరే నిజమైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గృహసముదాయాల్లో మౌలిక సదుపాయాలు, విద్యుత్ లేవని, మరోవైపు బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారని, దీంతో పేదల నలిగిపోతున్నారని పేర్కొన్నారు. నాటి టీడీపీ ఎమ్మెలను పార్టీ మార్చడం కోసం దక్షిణ నియోజకవర్గానికి చెందిన పార్టీ కార్యకర్తలకు అనకాపల్లిలో ఇళ్లు కేటాయించారని, పెందుర్తిలోనూ ఇదే తరహాలో జరిగిందని ఎమ్మెల్యే రామకృష్ణబాబు ఆరోపించారు. అందువల్ల నిజమైన లబ్ధిదారులను గుర్తించేందుకు విచారణ జరిపించాలని, అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా ముగిసిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు


కోలాటం నిర్వహిస్తున్న మహిళలు

వెంకోజీపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం కన్నుల పండువగా ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామస్థులందరూ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించుకున్నారు. మధ్యాహ్నం మహాఅన్నదానం చేపట్టారు. సుమారు వెయ్యి మంది పాల్గొన్నారు. సాయంత్రం మేళతాళాలు, వేదమంత్రాలతో అమ్మవారి ఊరేగింపు పురవీధులలో వైభవంగా సాగింది. సంఘం సభ్యులు, మహిళలు తలపై ఉత్సవ విగ్రహాలను మోస్తూ వీధులలో ఊరేగించారు. తీన్‌మార్, కోలాటం, సాముగరిడీలతో అమ్మవారిని ఊరేగించి సముద్రంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘం అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు, గౌరవ అధ్యక్షులు పీల వెంకట పరదేశినాయుడు, ఉపాధ్యక్షులు కర్రి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగరాజు, కార్యదర్శి ఆడారి.శివప్రకాష్, కోశాధికారి పొలమరశెట్టి త్రినాథ్, సహాయ కార్యదర్శులు కర్రి రఘు, రాజగిరి సురేష్, మహిళలు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులకు పసుపు, కుంకుమ సమర్పణ


కేంద్ర గౌరీ సేవా సంఘం సభ్యులను సత్కరించిన సీతారామ సేవా సంఘం సభ్యులు

వెంకోజీపాలెం, నవంబరు 16 : పాత వెంకోజీపాలెంలో శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో శనివారం కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు మళ్ల రవికుమార్ ఇతరులు గౌరీ పరమేశ్వరులకు పసుపు, కుంకుమలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీసీతారామ సేవా సంఘం వారు కేంద్ర సంఘం వారికి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, శ్రీ సీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు పీల వెంకట పరదేశినాయుడు, అధ్యక్షుడు ఆడారి పరదేశి నాయుడు, ఉపాధ్యక్షులు కర్రి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగరాజు, కోశాధికారి పొలమరశెట్టి త్రినాథ్, కార్యవర్గం ఆర్.సురేష్, మళ్ల కనకరాజు, గ్రామ సేవా సంఘం సభ్యులు మద్దాల వీర వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు

గ్రంథాలయ వారోత్సవాల్లో వ్యాస రచన పోటీలు


పోటీలు పాల్గొన్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంవీపీ కాలనీలోని నగర శాఖా గ్రంథాలయంలో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 6 నుంచి పదో తరగతి వరకూ పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. 'సెల్ ఫోన్ వినియోగం-విద్యార్థులపై ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీ ఏర్పాటు చేశారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి కేవీఏ ఉమామహేశ్వరరావు తెలిపారు.

'నైపుణ్యాభివృద్ధితో విస్తృత ఉపాధి అవకాశాలు'


అనిల్‌కుమార్‌కు సత్కరిస్తున్న ఏయూ ఆచార్యులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 'కెరీర్ కౌన్సెలింగ్, స్కిల్ డెవలప్‌మెంట్, ఇంటర్ ప్రెన్యూర్‌షిప్‌లో అవకాశాలు' అంశంపై ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగాధిపతి పేటేటి ప్రేమానందం ఆధ్వర్యంలో గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ప్రభుత్వం ప్రాంతీయ ఉపాధి అధికారి జోన్-1 టి.అనిల్‌కుమార్ హాజరయ్యారు. రాజనీతి, ప్రభుత్వ పాలనాశాస్త్రం చదువుతున్న విద్యార్థులు యునైటెడ్ నేషన్ ఆర్గనైజేషన్స్ నుంచి నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ వరకు ఎటువంటి ఉద్యోగ అవకాశాలను పొందవచ్చో వివరించారు. ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ప్రాజెక్టులను ఏ విధంగా వినియోగించుకోవాలని, ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవడం కోసం విద్యార్థులు కాలానుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో అధికారులు తీసుకువస్తున్న నూతన విధానాలు అర్థం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉద్యోగ అవకాశాల కోసం employment.ap.gov.in, ncp.gov.in అనే వెబ్‌సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. విభాగాధిపతి పేటేటి ప్రేమానందంమాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్‌లో నూతన విధానాలను అనుసరిస్తూ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తోందని, వాటిని ఉపయోగించుకుంటూ భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.


రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రాణి చంద్రమణి దేవి ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధి పెదవాల్తేరులోని రాణిచంద్రమణి దేవీ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగం, ల్యాబ్, వార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడ వైద్య సేవలు పొందుతున్న రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు గురించి తెలుసుకున్నారు. అనంతరం రోగులతో కాసేపు మాట్లాడారు. ఆస్పత్రి అంతా కలియతిరిగిన ఆయన అవసరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల హాజరు పట్టీ, అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ వివరాలు తెలుసుకోవడంతో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతులు, రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, వారి పట్ల ప్రేమగా వ్యవహరించాలని హితవు పలికారు. వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు.

బాలల హక్కులపై పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాల వికాస్ ఫౌండేషన్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 19 నుంచి 21 వరకూ బాలల హక్కులపై అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బాలల హక్కుల రక్షణ అవగాహన శిబిరాల పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. 19న బీవీఎఫ్ స్కూలు 20న ఏయూ సోషల్ వర్క్ విభాగం, 21న అక్కయ్యపాలెం వాగ్దేవీ స్కూలులో అవగాహన శిబిరాలు నిర్వహించనున్నట్టు ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, డాక్టర్ బాబ్జీ, డాక్టర్ అప్పారావు, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఏయూ ప్రతిష్ఠ పెంచండి : వీసీ


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, నవంబరు 16 : క్రీడల్లో ప్రతిభ చూపుతూ విద్యార్థులు ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను పెంచాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్‌కు వెళ్తున్న విద్యార్థులను ఆయన అభినందించారు. క్రాస్ కంట్రీ మెన్, వుమెన్ క్రీడా బృందాలు బయలుదేరి బెంగుళూరుకు వెళ్లనున్నాయి. ఈ సందర్భంగా వీరిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రీడా విభాగాధిపతి ఆచార్య ఏ.పల్లవి, క్రీడా విభాగ సంచాలకులు ఎన్.విజయమోహన్, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, బాక్సింగ్ కోచ్ ఐ.వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడి పూజ


పడిపూజలో పాల్గొన్న స్వాములు

వెంకోజీపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసి ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం పడిపూజ(పదెనెట్టాంబడి) మహోత్సవం కన్నుల వేడుకగా నిర్వహించారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయం 5 గంటలకు లక్ష్మీగణపతి హోమం, 6 గంటలకు పంచామృతాభిషేకాలు, నెయ్యాభిషేకం, చందనం, విభూతి, కుంకుమ, నారికేల, వివిధ పండ్ల రసాల ఇత్యాది సుగంధ ద్రవ్యాలతో అయ్యప్ప స్వామికి అభిషేకాలు జరిపారు. అనంతరం విశేష అలంకరణతో స్వామివారి దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, బాల భాస్కర శర్మలు భక్తుల పడిపూజ అభిషేకం చేశారు. కార్యక్రమంలో బోర ధన రెడ్డి, కాళ్ల శంకర్, ఆడారి కామేశ్వరరావు, మద్దాల వీర వెంకట అప్పారావు, ఎస్.నరసింహారెడ్డి, పీల నాగేశ్వరరావు, పీల సాంబ, ఆడారి శ్రీనివాస్, సంఘ కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'విద్యా స్వేచ్ఛ'తో పాఠశాల్లో ఆధునిక వసతులు


సమావేశంలో మాట్లాడుతున్న చైతన్య, డీఎస్ రాజు తదితరులు

రామ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలల్లో 'విద్యా స్వేచ్ఛ' నినాదంతో ఆధునిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు వాల్తేర్ రౌండ్ టేబుల్ 92 చైర్మన్ చిన్నం చైతన్య తెలిపారు. రౌండ్ టేబుల్ ఇండియా వారోత్సవాల సందర్భంగా శనివారం బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 నుంచి 40 ఏళ్ల వయస్సు గల యువకులు స్వచ్ఛందంగా నాయకత్వం వహించే రౌండ్ టేబుల్ వ్యవస్థ ద్వారా పేద విద్యార్థుల్లో వెలుగు నింపుతామన్నారు. ఏటా నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా ఈనెల 11 నుంచి 16 వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో సంస్థ వైస్ చైర్మన్ డీఎస్ రాజు, కార్యదర్శి మోహిత్ రవి సింఘాల్, బూరుగుపల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

ఉపాధి సాధన, ఉద్యోగాల ఎంపికపై అవగాహన

ఎంవీపీ కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పేటెంట్ల ఫైలింగ్, రీసెర్చ్ ప్రాధాన్యం, కెరీర్ కౌన్సెలింగ్ తదతర అంశాలపై ఎంవీపీ కాలనీ గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఏయూ మైక్రోబయాలజీ విభాగం ఆచార్యులు వై.రవికిరణ్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. ఉద్యోగాల సాధనలో స్వయం ఉపాధి దృక్పథం, అభిరుచి, ఆసక్తిని అనుగుణంగా ఉద్యోగాల ఎంపిక, లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడం వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. సంస్థ డైరెక్టర్ గిరిధర్, ప్రిన్సిపాల్ కేఎస్ బోస్, అధ్యాపక బృందం శేష పద్మ, డాక్టర్ సుజాత, డాక్టర్ శ్యామల ప్రసంగించారు.

అర్జున అవార్డుకు ఎర్రాజీ జ్యోతి పేరు సిఫార్సు



విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత క్రీడారంగంలో ప్రతిష్టాత్మక అర్జున అవార్డుకు నగరానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి పేరు సిఫార్సు చేసినట్టు జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.నారాయణరావు తెలిపారు. అథ్లెటిక్స్ 100 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డులు నెలకొల్పడమే కాక అద్భుతమైన విజయాలతో దేశానికి పతకాలను అందించిన జ్యోతి పేరును ఈ అవార్డుకు సిఫార్సు చేయడం జిల్లా అథ్లెటిక్స్ సంఘానికి గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆమె విజయమే లక్ష్యంగా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఒలింపిక్స్‌కు చేరడం విశేషమన్నారు. అంకితభావం, పట్టుదలకు నిదర్శనంగా నిలిచి యువ క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చిందన్నారు. ఆమె ఘన విజయాలను లేఖతో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

కనకమహాలక్ష్మికి తులసి దళార్చన



జగదాంబ కూడలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మికి తులసీ దళార్చన సేవలను శనివారం ఆలయ అధికారులు నిర్వహించారు. ఆలయ అర్చకులు, దేవాలయ అధికారుల నేతృత్వంలో పూజలు జరిగాయి. సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని టీపీటీ కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బృందావనం పార్కులో ఆదివారం ఉచిత వైద్య, రక్త పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ ప్రెసిడెంట్ గొర్తి ప్రసన్న, కార్యనిర్వాహక సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నిపుణులైన వైద్యులతో ఉచిత వైద్య, రక్త పరీక్షలు, బీపీ, కొలెస్ట్రాల్, వైటల్ పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ప్రముఖ ఎండోక్రైనాలజీ వైద్యులు డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ కేబీ స్వామి హాజరవుతారని, శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21 నుంచి జాబ్‌మేళా

కంచరపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో 21 నుంచి నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి. రమణ తెలిపారు. క్యాంపస్ టు కార్పొరేట్ ఫర్ డిగ్రీ,డిప్లొమా, ఐటీఐ స్టూడెంట్స్ పేరుతో ప్రముఖ టైర్ల కంపెనీ ఎంఆర్ఎఫ్ ఈ మేళాలో పాల్గొని మౌఖిక పరీక్ష నిర్వహిస్తుంది. డిగ్రీ, డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులకు ఈ నెల 21, 22 తేదీల్లో పదోతరగతి, ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన వారికి 23, 24 తేదీల్లో మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారు. ఎంఆర్ఎఫ్ సంస్థ టీఎంఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీ సౌజన్యంతో 'నేర్చుకో..సంపాదించుకో.. అభివృద్ధి చెందు' అన్న నినాదంతో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.రమణ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన స్టైఫండ్, అనంతరం వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు (మగ) ఆయా తేదీల్లో మౌఖిక పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

యువజనోత్సవాలకు 25న ఎంపిక

అల్లిపురం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో డిసెంబరు 16, 17 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సాహిత్య, సాంస్కృతిక యువజనోత్సవాల్లో పాల్గొనదలచిన రచయితలు, కళాకారులు నవంబరు 25న అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించే ఎంపిక కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కళలు సాహిత్యం పట్ల అభిరుచి గల నేటితరం యువకులను ప్రోత్సహించేందుకు యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో అచ్యుతరావు, యు.అప్పలరాజు, వై.రాంబాబు, యు.నాగరాజు, ఎన్.అప్పన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

సీతంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో స్థితప్రజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వైవీపీ సత్యనారాయణ, శేషగిరిరావు, వై.విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ పార్కులో హనుమాన్ చాలీసా

మాధవధార, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాధవధార కళింగనగర్ ఈస్ట్ పార్కులో శనివారం హనుమాన్ చాలీసా భక్తి కార్యక్రమం నిర్వహించారు. పూర్వాంచల్ కీర్తన భజన్ మండలి సభ్యులు చేపట్టిన ఈ కార్యక్రమంలో స్థానికులు, పార్కు వాకర్లు పాల్గొన్నారు. పార్కులో కొత్తగా నిర్మించిన ఆడిటోరియంలో ఈ హనుమాన్ చాలీసా భజన సాయంత్రం 6 గంటలకు నిర్వహించారు. పార్కు కమిటీ అధ్యక్షులు బి.మురళీకృష్ణ, సభ్యులు, స్థానిక మహిళా క్లబ్ సభ్యులు హాజరయ్యారు.

అకృత్యాలకు అడ్డాగా సరస్వతీ పార్కు!

డాబాగార్డెన్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పార్కు అంటే... నగరంలో తెలియనివారుండరు. అలాంటి ఈ పార్కు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. పార్కులో ఆసనాల వెనుక, ఆహ్లాదాన్ని పంచే మొక్కల్లోనూ మద్యం సీసాలు కనిపించడంతో సందర్శకులు అవాక్కవుతున్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని సరస్వతీ పార్కులో రాత్రివేళ సమస్య మరింత జటిలంగా తయారైంది. ఆకతాయిలకు ఈ పార్కు ఎంచక్కా ఉపయోగపడుతుంటే... స్థానికులు, సందర్శకులకు మాత్రం రోత పుట్టిస్తోంది. పార్కులోని ఆహ్లాదాన్ని ఆస్వాదించాలని అడుగుపెడితే. మద్యం సీసాలు, సిగరెట్టు ప్యాకెట్లు కని



బెంచీల వెనుక మద్యం సీసాలు



మందుబాబులు ప్రవేశించే పార్కు, దక్షిణవైపు భాగం

పించడంతో మహిళలు, చిన్నారులు చీదరించుకుంటున్నారు. ఇందులోని ఓపెన్ జిమ్ చేద్దామని వచ్చిన వారికి అసౌకర్యంగా ఉండడంతో వెనుదిరుగుతున్నారు. సందర్శకులు ఎక్కువ సేపు కూర్చునేందుకు ఆసక్తి చూపడం లేదు. కూతవేటు దూరంలోనే జీవీఎంసీ జోనల్-4 కార్యాలయం, మరికొంతదూరంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. నిరంతర పర్యవేక్షణ, రాత్రివేళ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నారులతో రాలేకపోతున్నాం

సాయంత్రం వేళలో పార్కులో కూర్చోవాలంటే అసౌకర్యంగా ఉంటోంది. రాత్రి వేళ ఎవరూ లేని సమయంలో మద్యం సీసాలు, సిగరెట్లు, ఇతర వ్యర్థాలను చెట్లులో విసురుతున్నారు. వాటిని చూసిన వెంటనే తిరిగి ఇంటికి వెళ్లిపోవాలనిపిస్తోంది. చిన్నారులతో రావడం ఇబ్బందికరంగా ఉంటోంది.

- ప్రణీత, స్థానికురాలు

పర్యవేక్షణ అవసరం

పార్కులో రాత్రి వేళ పర్యవేక్షణ ఉండాలి. నిత్యం విద్యుత్ దీపాలు వెలిగితే ఇతర వ్యక్తులు రావడానికి అవకాశం ఉండదు. అధికారులు భద్రత చర్యలు తీసుకుంటే అన్ని వర్గాల వారు పార్కును సద్వినియోగం చేసుకునే అవకాశం కలుగుతుంది.

- ఎం.సూరిబాబు, డాబాగార్డెన్స్

నర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఆరా



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్సింగ్ సంఘం సభ్యులు

మహారాణిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షురాలు టి.గంగాభవానీ నాయకత్వంలో సభ్యులు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసిన గంగాభవానీ కలెక్టర్‌కు సభ్యులను పరిచయం చేశారు. అనంతరం కలెక్టర్ వారితో మాట్లాడుతూ నర్సింగ్ ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షురాలు ఇందిర, కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా ఉన్న డివైడర్ తొలగింపు

సీతమ్మధార, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రహదారికి అడ్డంగా వేసిన డివైడర్‌ను ట్రాఫిక్ పోలీసులు ఎట్టకేలకు తొలగించారు. అర్ధరాత్రి డివైడర్ ఏర్పాటు ఎవరి కోసం? శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికల్లో ఈ నెల 14న వార్త ప్రచురించడంతో స్పందించిన పోలీసులు డివైడర్‌ను జేసీబీ సహాయంతో తొలగించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

'కవితానుభూతికి హద్దులు లేవు'



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ డి.వి. సూర్యారావు

సీతంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం 'పుస్తకం.. గ్రంథాలయం' అనే అంశంపై కవితా గోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విశిష్ట అతిథి బమ్మిడిశెట్టి చక్రపాణి మాట్లాడుతూ కవితానుభూతికి హద్దులు లేవని, కవిత నేటి వాస్తవమే కాక భవిష్యత్ వాగ్దానం అని పేర్కొన్నారు. రచయిత అడపా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవితా గోష్ఠిని డాక్టర్ మరడాని సుబ్బారావు సమీక్షించి, కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రచయితలు, కవులు, సాహితీప్రియులు రాధారాణి, డాక్టర్ నిర్మలాదేవి, భాగవతుల శాస్త్రి, డాక్టర్ డి.వి. సూర్యారావు, చిన్ని సూర్యనారాయణ, గౌరీపతి శాస్త్రి, ఉప్పల అప్పలరాజు తదితరులు కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్ రెడ్డి, సుసర్ల సర్వేశ్వరశాస్త్రి, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా అంబలం పూజ

సీతమ్మధార, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా అయ్యప్ప భక్తులు బి. రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అంబలం పూజ కన్నుల పండువగా నిర్వహించారు. మందిరాన్ని సుందరంగా అలంకరించారు. అయ్యప్ప స్వామి మందిరం ప్రారంభం సందర్భంగా ఉన్నికృష్ణన్ స్వామి పర్యవేక్షణలో మొదటి పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. దీనికి ఆర్థిక సహాయం చేసిన పారిశ్రామికవేత్తలు గోవింద్, పరుశురామ్‌రాజు, స్వాతి రమేష్ రెడ్డి, డీవీఎస్ ప్రసాద్ రెడ్డి విచ్చేశారు. అయ్యప్ప భక్తులు పాటలతో అలరించారు.

అన్నదానం గణేష్‌నగర్‌లో గురుస్వామి గిరి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ నారా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సుందరంగా అలంకరించిన అయ్యప్ప అంబలం, భక్తులు

పుష్పాభిషేకం

అక్కయ్యపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి ఎదురుగా ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలోని ఉపాలయంలో వేంచేసిన అయ్యప్పస్వామికి శైవ ఆగమ సంప్రదాయంలో మంగళ ధ్వని వేదమంత్రాలతో ఆలయ అర్చకుడు గురుస్వామి బాలానంద శివాచార్య స్వామి వివిధ రకాల పుష్పాభిషేకాన్ని వేదోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తిరువీధి మహోత్సవాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పి.వేణుగోపాల్, గురుపాద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



అలంకరణలో అయ్యప్పస్వామి

'ఎస్సీ సబ్ ప్లాన్ బడ్జెట్ రూ.34 వేల కోట్లకు పెంచండి'

సీతంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రద్దు చేసిన అన్ని సంక్షేమ పథకాల పునరుద్ధరణకు సరిపడా ఎస్సీ సబ్ ప్లాన్ బడ్జెట్ రూ.34 వేల కోట్లకు పెంచాలని విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. రామాటాకీస్ రోడ్డు సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బడ్జెట్ కేటాయింపులపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ తెరవడం సంతోషమే కానీ... కేవలం రూ.341 కోట్లు కేటాయించడం సరికాదని, దాన్ని రూ.1000 కోట్లకు పెంచాలన్నారు. విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని, ఎస్సీల ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలని కోరారు. సుమారు 10 సవరణలను ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. సభకు హాజరుకాని వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోడదాసి సుధాకర్, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారి చొరవతో ఆర్పీపేట పాఠశాలకు మంచినీటి సౌకర్యం

కంచరపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలను జిల్లా డిప్యూటీ డీఈవో అంబటి సోమేశ్వరరావు శనివారం సందర్శించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన 'ఆర్పీపేట ఉన్నత పాఠశాల్లో దాహం..దాహం..' కథనం చదివిన సోమేశ్వరరావు పాఠశాలను సందర్శించి ఆర్వో ప్లాంట్‌ను చూసి మరమ్మతులకు చర్య తీసుకుంటామని తెలిపారు. ఆయన సూచన మేరకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా జీవీఎంసీ అధికారులు మినరల్ వాటర్‌ను పాఠశాలకు పంపారు. అనంతరం డిప్యూటీ డీఈవో ఉపాధ్యాయ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సెల్ఫ్ అసెస్‌మెంట్ మార్కుల వివరాలను తక్షణమే పూర్తిచేయాలని ఆదేశించారు. హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

'వెలమల సమస్యలు పరిష్కరించాలి'

మహారాణిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెలమ సామాజిక వర్గాన్ని బి.సి. 'డి' నుంచి 'ఎ'లోకి మార్చి తగిన గుర్తింపు ఇవ్వాలని రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవింద్ కోరారు. వెలమ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పలువురు మంత్రులు, డిప్యూటీ స్పీకరును శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందించినట్లు శనివారం ఇక్కడ తెలిపారు. గోవింద్ మాట్లాడుతూ తాటిపూడి జలాశయానికి గొర్రుపాటి బుచ్చిఅప్పారావు పేరును కొనసాగించాలని, రాష్ట్రంలో బి.సి.ల కుల గణన చేపట్టాలని, విదేశాల్లో ఉన్నత చదువుల కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజులు హామీ ఇచ్చారని గోవింద్ తెలిపారు.



మంత్రి అచ్చెన్నాయుడుతో కరచాలనం చేస్తున్న లగుడు గోవింద్ తదితరులు

తైక్వాండోలో ధనుష్‌కు పతకం



ధనుష్‌ను అభినందిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ అండర్-14 బాలుర తైక్వాండో టోర్నీలో నగరంలోని గోపాలపట్నం ప్రాంత పాఠశాలకు చెందిన అక్కిరెడ్డి వెంకట ధనుష్ పతకం సాధించాడు. మధ్యప్రదేశ్‌లోని విదిషాలో జరిగే ఈ టోర్నీలో బాలుర 35-38 కిలోల విభాగంలో ధనుష్ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తన కార్యాలయంలో ధనుష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వి.దేముడు, తైక్వాండో కోచ్ సీహెచ్.ప్రసన్న పాల్గొన్నారు.

చంద్రబాబును నిర్బంధించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

మర్రిపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు విశాఖ విచ్చేసిన ప్రస్తుత సీఎం చంద్రబాబును అడ్డుకుని తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన వైసీపీ నాయకులు కె.కె.రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్, కోలా గురువులు, ఆళ్ళ శివగణేష్‌లపై చర్యలు తీసుకోవాలని జిల్లా టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాలరెడ్డి కోరారు. శనివారం ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్‌లో సీఐ చక్రధరరావుకు ఫిర్యాదు అందజేశారు. ఫిర్యాదును పరిశీలించి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని సీఐ చెప్పినట్లు కె.గోపాలరెడ్డి తెలిపారు.

నారీమణుల 'జిమ్' బాట

... 5వ పేజీ తరువాయి

కిలోల వరకు బరువు తగ్గినట్టు జ్యోత్స్న అనే ఆమె చెప్పారు. జిమ్‌కు వస్తున్న ప్రతి వంద మంది మహిళల్లో 30 మంది విద్యార్థినులు, మరో 30 మంది గృహిణులు, మరో 30 మంది వరకు ఉద్యోగినులు ఉంటుండగా, పది మంది పదేళ్లలోపు బాలికలు ఉంటున్నారు. బాలికలు స్పోర్ట్స్ కోసం జిమ్‌లో చేరి శరీర ఆకృతిని మార్చుకుంటున్నారు. నగరంలో జిమ్‌ను బట్టి నెలకు రూ.1500 నుంచి రూ.2500 వరకూ ఫీజు తీసుకుంటున్నారు. మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాది ప్యాకేజీలు కూడా ఉంటాయి. జిమ్‌లో చేరే మహిళలు తప్పనిసరిగా రోజుకు కనీసం రెండు గంటలు సమయాన్ని కేటాయించాల్సి ఉంటుంది.

ఇవీ వర్కౌట్స్..

మహిళల సమస్యలు, అవసరాలను బట్టి వర్కౌట్స్ చేయిస్తామని ట్రైనర్స్ చెబుతున్నారు. ఎక్కువగా స్ట్రెంత్ ట్రైనింగ్, హీట్ వర్కవుట్స్, బాడీ టోనింగ్, ఫ్యాట్ లాస్, వెయిట్ లాస్/గెయిన్ వర్కౌట్స్ చేయిస్తుంటారు. జిమ్‌లో చేరే మహిళలు తప్పనిసరిగా డైట్ కూడా ఫాలో కావాల్సి ఉంటుంది. పర్సనల్ ట్రైనర్స్ డైట్‌కు సంబంధించి మెనూ చెబుతారు. ఒకవైపు వర్కౌట్స్ చేస్తూనే డైట్ పాటించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చు.

కళకళలాడుతున్న జిమ్‌లు..

ఒకప్పుడు జిమ్‌లు పురుషులపైనే ఆధారపడి ఉండేవి. ఇప్పుడు మహిళలు కూడా భారీగా వస్తుండడంతో అందుకు అనుగుణంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల ప్రత్యేకంగా మహిళల కోసం జిమ్స్‌లు నిర్వహిస్తున్నారు. మహిళల కోసం ఫిట్‌నెస్ ట్రైనర్స్‌ను నిర్వాహకులు నియమించుకుంటున్నారు. కొన్నిచోట్ల పురుష ట్రైనర్సే మహిళలతో వర్కౌట్లు చేయిస్తుంటారు. ఒకప్పుడు జిమ్ అంటే ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే తెరిచి ఉండేది. ఇప్పుడు 24 గంటలు రన్ చేస్తున్నారు. మహిళలు ఎప్పుడు కావాలంటే అప్పుడు చేసుకునే వెసులుబాటును జిమ్ నిర్వాహకుల కల్పిస్తున్నారు.

మహిళల సంఖ్య పెరిగింది



గతంతో పోలిస్తే జిమ్‌కు వస్తున్న మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. గడిచిన మూడేళ్లలో 20 నుంచి 30 శాతం మంది మహిళలు జిమ్‌కు వస్తున్నారు. మహిళల్లో ఆరోగ్యం పట్ల పెరిగిన శ్రద్ధ, ఫిట్‌గా ఉండాలన్న ఆకాంక్ష ఇందుకు కారణమవుతున్నాయి. రోజువారీ కొన్ని వర్కౌట్స్ చేయడం ద్వారా బరువు తగ్గడంతోపాటు ఫిట్‌గా మారవచ్చు. ఇందుకోసం కనీసం రెండు గంటలు సమయాన్ని కేటాయించాల్సి ఉంటుంది. జిమ్‌లో కష్టపడడంతోపాటు డైట్ విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అప్పుడే మెరుగైన ఫలితాలు వస్తుంటాయి.

- ఎల్.మోహనరావు
ఫిట్ ట్రైనర్, మారుతీ జిమ్ అధినేత
అక్కయ్యపాలెం

జోరుగా విమానయానం

... 5వ పేజీ తరువాయి

చేయగా, ఈ ఏడాది అక్టోబరులో 2,52,499 మంది (8.83 శాతం ఎక్కువ) రాకపోకలు సాగించారు. విమానాల లెక్కలు పరిశీలిస్తే గత ఏడాది అక్టోబరులో విశాఖ నుంచి 1,732 విమానాలు నడవగా, ఈ ఏడాది అక్టోబరులో 1,855 విమానాలు నడిచాయి. వీటిలో 7.1 శాతం వృద్ధి నమోదైంది.

వింటర్ షెడ్యూల్‌లో మరో మూడు సర్వీస్‌లు

అక్టోబరు 28వ తేదీ నుంచి కొత్త వింటర్ షెడ్యూల్ అమలులోకి వచ్చింది. అంతకు ముందు రోజుకు 32 విమానాలు అందుబాటులో ఉండగా, ఇప్పుడు మరో మూడు పెరిగాయి. అంటే ఇటు నుంచి వెళ్లేవి 35 అయితే, అటు నుంచి వచ్చేవి మరో 35. రోజుకు 70 విమానాల కింద లెక్క. ప్రయాణికుల సంఖ్య కూడా దానికి తగ్గట్టుగానే పెరుగుతోంది. **- రాజారెడ్డి, విమానాశ్రయం డైరెక్టర్**

కోడి వ్యర్థాల కాంట్రాక్టు కోసం పట్టు

... 5వ పేజీ తరువాయి

వాటి కోసం పోటీపడడం మొదలెట్టారు. ఇది నగరంలో చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించే కాంట్రాక్టు పొందినవారికి వరంగా మారింది. కాపులుప్పాడలోని యార్డుకు తరలించకుండా, జీవీఎంసీ అధికారులను మేనేజ్ చేసుకుని వ్యర్థాలను నేరుగా చేపల చెరువులకు తరలించడం ప్రారంభించారు. దీనివల్ల చికెన్ వ్యర్థాలను సేకరించే కాంట్రాక్టర్లకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. చికెన్ వ్యర్థాలను సేకరించేందుకు జీవీఎంసీ అప్పగించిన కాంట్రాక్టు గడువు ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగియడంతో కొత్తగా టెండర్లు పిలవాలని నిర్ణయించింది. ఆగస్టులో జోన్‌ల వారీగా ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు పిలిచింది. సెప్టెంబరు ఆరున టెండర్లు తెరిచి అర్హులైన వారికి పనులు అప్పగిస్తామని నోటీసులో పేర్కొంది. అయితే టెండర్ నోటిఫికేషన్ విషయం తమకు తెలియలేదు కాబట్టి, గడువు పెంచాలంటూ కొంతమంది కార్పొరేటర్లు జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. దీంతో అక్టోబరు ఐదు వరకూ టెండరు దాఖలుకు అవకాశం కల్పించారు. 6న టెండర్లు తెరుస్తామన్నారు.

ప్రజాప్రతినిధుల జోక్యంతో ఆగిన ప్రక్రియ

కోడి వ్యర్థాల సేకరణ కాంట్రాక్టు దక్కితే భారీగా సంపాదించవచ్చునని భావించి టెండర్‌లో పాల్గొన్నవారు కొందరు నగరంతోపాటు అనకాపల్లి జిల్లాలో తమకు తెలిసిన నేతలను కలిసి తమకు దక్కేలా చూడాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతో ప్రజా ప్రతినిధులు జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి చికెన్ వ్యర్థాల కాంట్రాక్టు తాము సూచించిన వారికి వచ్చేలా చూడాలని ఆదేశిస్తున్నారు. నగరానికి చెందిన ఇద్దరు ప్రజా ప్రతినిధులు, మరొక మాజీ ప్రతినిధి నేరుగా సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి తాము చెప్పినవారికి కనీసం ఒక్కో జోన్ కాంట్రాక్టు దక్కేలా చూడాలని ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది. రూరల్ జిల్లాకు చెందిన మరో ప్రజా ప్రతినిధి కూడా జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి చాలాకాలంగా పార్టీ కోసం పని చేసిన వ్యక్తి చికెన్‌వ్యర్థాల సేకరణకు టెండర్ వేశారని, కచ్చితంగా ఒక జోన్ ఆయనకు ఇప్పించాల్సిందేనని చెప్పినట్టు సమాచారం. అయితే నిబంధనలకు విరుద్ధంగా టెండర్ ఖరారు చేస్తే తాము ఇబ్బంది పడాల్సి వస్తుందని అధికారులు భయపడుతున్నారు. అందుకే గత నెల ఆరున తెరవాల్సిన టెండర్లను ఇంతవరకూ తెరవకుండా పక్కనపెట్టేశారు. ఈ విషయం ఒక అధికారి వద్ద ప్రస్తావించగా, ఉన్నతస్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయని, ఏం చేయాలో దిక్కుతోచక ముందుకు వెళ్లడం లేదని సమాధానం ఇచ్చారు.

బడ్డీల తొలగింపులో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

బడ్డీల తొలగింపునకు జీవీఎంసీ అధికారులు వంద మంది కూలీలను తీసుకుని రావడం విశేషం. వారంతా బడ్డీలు ధ్వంసం చేస్తుంటే అక్కడకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు తాళ్లతో రక్షణ వలయం తయారుచేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగించి సుమారు 300 దుకాణాలను తొలగించారు. దీంతో వార్డులో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చిరు వర్తకులు ఆగ్రహంతో తొలగింపును అడ్డుకోవడానికి యత్నించారు. అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. అవే తమకు బతుకుదెరువని, బడ్డీలు తీయొద్దని మొరపెట్టుకున్నారు. అయితే వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి హైకోర్టులో కేసు వేశారని, ఆక్రమణలు తొలగించాలని న్యాయస్థానం ఆదేశాలిచ్చిందని అందుకే తొలగిస్తున్నామని జీవీఎంసీ అధికారులు సమాధానమిచ్చారు. దీంతో బాధితులు పెద్దఎత్తున మూర్తియాదవ్ ఇంటిని ముట్టడించడానికి ర్యాలీగా బయలుదేరారు. వారంతా మూర్తి యాదవ్ ఇంటి వద్దకు చేరుకోగా అక్కడ భారీగా మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. ఇంటిని ముట్టడిస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. దీంతో మూర్తియాదవ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు బాధితులు వార్డులో ర్యాలీ నిర్వహించారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

22వ వార్డులో స్ట్రీట్ వెండర్స్ యాక్ట్‌కు విరుద్ధంగా రోడ్డు మార్జిన్ దాటి జరిగిన ఆక్రమణలపై జీవీఎంసీ చర్యలు తీసుకోవడం లేదని కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలు చేశారు. ఆయన పిల్ మేరకు హైకోర్టు జీవీఎంసీకి నోటీసులు జారీచేసింది. హైకోర్టు నోటీసులకు జీవీఎంసీ అధికారులు కౌంటర్ దాఖాలు చేయలేదు. దీంతో స్ట్రీట్ వెండర్స్ యాక్ట్‌కు లోబడి రోడ్డు మార్జిన్ దాటిన ఆక్రమణలు మాత్రమే తొలగించాలని మే 10న హైకోర్టు ఆదేశాలిచ్చింది. అయితే నగరంలో స్ట్రీట్ వెండర్స్ యాక్ట్ అమలులోనే లేదు. ఈ యాక్ట్ ప్రకారం వీధి వ్యాపారులకు హాకర్స్ జోన్ ఏర్పాటుచేయాలి. రోడ్డు వెడల్పు ఆధారంగా తెలుపు సున్నంతో మార్జిన్ గీతలు గీసి అందులోనే వ్యాపారాలు చేసుకోవలసిందిగా సూచించాలి. జీవీఎంసీ వీధివ్యాపారులకు గుర్తింపు కార్డులిచ్చి వ్యాపార రక్షణ కల్పించాలి. ఇవేమీ 22వ వార్డులో అమలులో లేకపోయినా మార్జిన్ దాటిన ఆక్రమణలు మాత్రమే తొలగించాలని హైకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి మరీ మొత్తం శివాజీపాలెం, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెంలో ఎక్కడా ఒక్క దుకాణం లేకుండా పూర్తిగా తొలగించారు.

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్



విజేతలతో కళాశాల అధ్యాపకులు

జ్ఞానాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర కళాశాలల మహిళా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలను ఏయూ ఫిజికల్ డైరెక్టర్ ఆచార్య విజయమోహన్ ప్రారంభించారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థినులు పోటీల్లో పాల్గొనగా బుల్లయ్య కళాశాల, సెయింట్ జోసెఫ్ కళాశాలల విద్యార్థినులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తెలిపారు. అనంతరం విజేతలకు షీల్డ్‌లు,ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డా.పీకే జయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ డా. ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

అలరించిన గాత్ర కచేరీ



కచేరీ నిర్వహిస్తున్న శ్రీనివాసరాజారావు

మద్దిలపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన గాత్ర కచేరీ అలరించింది. ముత్తుస్వామి దీక్షితర్ వర్ధంతి సందర్భంగా త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ నిర్వహించిన కచేరిలో అకొండి శ్రీనివాసరాజారావు అద్భుత గానంతో శ్రోతలను మైమరిపించారు. రూపక తాళంలో సిద్ధివినాయకం షణ్ముఖప్రియ గానం అందర్నీ ఆకట్టుకుంది. పార్వతిపతిం, వారాహిం, ఏకామ్రేశనాయికం, పురహరనందన గానాలు ఆలపించి కళాభిమానులను మంత్రముగ్ధులను చేశారు. వయొలిన్‌పై లక్ష్మీగణపతిశర్మ, మృదంగంపై ఎస్.సుబ్రమణ్యం సహకారం అందించారు. కార్యక్రమంలో కళాభారతి నిర్వహకులు రాంబాబు, మంతెన సత్యనారాయణ పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ లెక్కింపు



పర్యవేక్షిస్తున్న ఈవో శిరీష, టీఆర్ చోళన్

సిరిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీసంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించినట్టు ఆలయ ఈవో కె.శిరీష, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. గత 28 రోజులకు రూ.17,98,346, బంగారం 3 గ్రాముల 027 మిల్లీ గ్రాములు, సిల్వర్ 0-101-100 మిల్లీ గ్రాములు, యూఎస్‌ఏ డాలర్ 20, యూఏఈ డెర్హామ్స్ 10, రెండు ఎస్‌బీఐ చెక్కు రూ.111, ఎస్‌బీఐ చెక్కు రూ.111 ద్వారా వచ్చాయని వెల్లడించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ హుండీల సూపర్‌వైజర్ ఎం.శ్రీధర్, శివజ్యోతి సేవా సంఘం, యూనియన్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

ఆరిలోవ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 12వ వార్డులోని 24, 26 పోలింగ్ బూత్‌ల పరిధిలో శనివారం చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకుంటే బీమా సదుపాయంతో పాటు అనేక విధాలుగా పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీవార్డు అధ్యక్షుడు గాడి సత్యంతో పాటు స్థానికనేతలు, కార్యకర్తలుపాల్గొన్నారు.

సినిమా గైడ్

● **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)

● **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)

● **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)

● **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు)56, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 28, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 30, క్యారెట్ 62 దొండకాయలు 30, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 50, కీర దోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

రూ.లక్షల వ్యయం.. సమస్య యథాతథం

» 'ముడసర్లోవ'లోకి మురుగు ప్రవాహం
» కొండల పై నుంచి వస్తున్న నీటిలో కలుస్తున్న కలుషిత నీరు
» రూ.లక్షలు వెచ్చించి గోడ కట్టినా ఫలిత శూన్యం
» ఇంజనీరింగ్ అధికారుల నిర్వాకంతో ప్రజా ధనం వృథా



ముడసర్లోవ రిజర్వాయరుకు వెళుతున్న గెడ్డ నీరు



ముడసర్లోవ రిజర్వాయర్‌లో చేరుతున్న మురుగు

ఆరిలోవ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొండలపై వర్షం పడినప్పుడు ఆ నీరు రామకృష్ణాపురం గెడ్డలోకి చేరి అక్కడ నుంచి ముడసర్లోవ రిజర్వాయర్‌కు చేరుతుంది. అయితే ఈ మధ్యలో రామకృష్ణాపురం గ్రామస్థులు, కేంద్ర కారాగారం నుంచి వాడుక నీరు ఈ ప్రవాహ నీటిలో కలిసి కలుషితం అవుతోంది. తర్వాత ఈ మురుగునీరు ముడసర్లోవ రిజర్వాయర్‌లో కలుస్తోంది.

రామకృష్ణాపురం, కేంద్ర కారాగారం నుంచే వచ్చే మురుగు నీరు వేరే చేయడానికి గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి సిమెంట్ కాంక్రీట్ పనులు చేశారు. అయితే మురుగునీరు ముడసర్లోవ రిజర్వాయర్‌కు వెళ్లకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. ఏదో పని అయిందనిపించామన్నట్టుగా రెండు నీటి పాయల మధ్య ఓ సన్నని గోడ కట్టి వదిలేశారు. దీంతో సమస్య పరిష్కారం కాలేదు. ఇక్కడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి సూయిజ్‌ప్లాంటుకు అనుసంధానం చేసినట్టయితే ఈ నీరు కలుషితం కాకుండా ఉండేది. కానీ అధికారులు అనాలోచితంగా ప్రజాధనాన్ని వృథా చేయడం మినహా ఉపయోగకరంగా పనులు చేపట్టలేకపోయారన్న విమర్శలు ఉన్నాయి. కొండల పై నుంచి వచ్చే నీరులో ఎలాంటి మురుగునీరు కలవకుండా ముడసర్లోవ రిజర్వాయర్‌లో కలిసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కొన్నాళ్లకు రిజర్వాయర్ ప్రక్షాళన చేపట్టాల్సిన పరిస్థితి ఎదురవుతుందని పలువురు అంటున్నారు. ప్రస్తుతం ముడసర్లోవ రిజర్వాయర్ నుంచి తాగునీటి అవసరాల కోసం ఆరిలోవ, పెదగదిలి ప్రాంతాల వారికి సరఫరా చేస్తున్నారు. ఇది కాస్తా కలుషితం కావడంతో ఎప్పుడు ఏ వ్యాధులు సంభవిస్తాయోనని ఆయా ప్రాంతాల వాసులు ఆందోళన చెందుతున్నారు. అలాంటి విపత్కరమేదో సంభవించక ముందే అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డిమాండ్ల సాధనకు పెన్షనర్ల ధర్నా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

సిరిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎవరి దయాదాక్షిణ్యాలపై తాము జీవించడం లేదని, డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని పెన్షన్‌దారులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ పెన్షన్ తమ హక్కు అని భావించి పెన్షన్‌దారులందరూ ఉద్యమించడం ద్వారా ప్రభుత్వం దిగివస్తుందన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ఇవ్వడానికి అనేక ఆటంకాలు సృష్టించడం దుర్మార్గమన్నారు. పెన్షనర్లకు మొండి చెయ్యి చూపడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగాల్లో పని చేసే ఉద్యోగులకు పీఎఫ్, మేనేజ్‌మెంట్ వాటా ఇవ్వాలని కొత్తగా ఈపీఎఫ్ తీసుకొచ్చి మేనేజ్‌మెంట్ వాటా ఎగ్గొట్టారని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలు నడిపే బ్యాంకుల్లో ఇన్సూరెన్స్ దోపిడీ ఉంటుందని, సంక్షేమం ఉండదన్నారు. ఏపీఆర్‌పీఏ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలన్నారు. మినిమమ్ పెన్షన్ రూ.9 వేలు అమలు ఏయాలని కోరారు. ఈపీఎస్ 95 పెన్షన్‌కు ఇతర పెన్షనర్స్ వలె కరువుభత్యం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యూవీఎస్ఎన్ వర్మ, ఎం.రామారావు, కె.సుధాకర్, కె.దీనబంధు, బాబూరావు, అప్పారావు, పెన్షనర్స్ రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఏయూలో స్వచ్ఛత హీ సేవ



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ జాతీయ సేవా పథకం యూనిట్-2 ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని ఏయూలోని కేంద్రీయ గ్రంథాలయం, కాన్వొకేషన్ హాలు వద్ద నిర్వహించారు. లైబ్రరీ వెనుక భాగంలో ఉన్న చెట్ల పొదలను పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం కాన్వొకేషన్ హాలు, లైబ్రరీకి మధ్యలో ఉన్న పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్త, ముళ్లపొదలను పూర్తిగా తొలగించారు. ఈ కార్యక్రమాన్ని కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు ఆదేశాల మేరకు జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్, ఎంఏ సోషియాలజీ, ఎంఏ హిందీ, ఎంఏ సోషల్ వర్క్ విద్యార్థి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

జాతీయ సాహస శిక్షణా శిబిరానికి ఏయూ విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ

వెంకోజీపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏయూ జాతీయ సేవా పథకానికి చెందిన పదిమంది విద్యార్థులు జాతీయ సాహస శిక్షణా శిబిరానికి ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు హిమచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో జరిగే శిక్షణ కార్యక్రమానికి వీరు హాజరవుతారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు అభినందించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రోగ్రాం అధికారిగా డాక్టర్ పల్లవి పాల్గొంటారు.

బోరువెల్స్ ప్రారంభం



బోరువెల్ ప్రారంభిస్తున్న రామలక్ష్మి

ఆరిలోవ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు లేని ప్రాంతంగా 10వ వార్డును తీర్చిదిద్దుతానని స్థానిక కార్పొరేటర్ మద్ది రామలక్ష్మి అన్నారు. శనివారం ఆమె వార్డులోని బీఎస్ నగర్ కొండవాలు ప్రాంతం, రవీంద్రనగర్‌లో తాగునీటి బోరువెల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు, గ్రామ పెద్దలు, జనసేన, బీజేపీ స్థానిక నేతలు పాల్గొన్నారు.

'టిడ్కో'ను పైశాచిక ఆనందానికి పరాకాష్ఠగా మార్చేశారు

» వైసీపీ హయాంలో తీరుపై అసెంబ్లీలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు విసుర్లు



వెంకోజీపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో హౌసింగ్ అనేది మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పైశాచిక ఆనందానికి పరాకాష్ఠగా మార్చేశారని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు విమర్శించారు. శనివారం అసెంబ్లీలో టిడ్కో నివాసాలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ విశాఖలో 2014-19 సమయంలో అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వాలని అప్పటి సీఎం చంద్రబాబు హయాంలో యూసీడీ సిబ్బంది ద్వారా ఇంటింటికి సర్వే చేసి, 1.20 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించారన్నారు. పి-1, పి-2, పి-3 రూపంలో జాబితాను సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపించారని, దీంతో కేంద్ర ప్రభుత్వం విశాఖకు అత్యధికంగా లక్షకు పైగా ఇళ్లు మంజూరు చేసిందన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపం ప్రభుత్వంలో గతంలో సిద్ధం చేసిన జాబితాను పక్కన పెట్టి, సొంత జాబితాను రూపొందించి తమ అనుకున్న వాళ్లకు మాత్రమే ఇళ్లు కేటాయించిందని ఎమ్మెల్యే ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లు విశాఖకు 24,192 మంజూరు చేస్తే, తూర్పు నియోజకవర్గానికి 3354 మంది లబ్ధిదారులకు కేటాయించారన్నారు. వీటిలో దబ్బందలో 1920 మంజూరు చేయగా, 1500 మంది లబ్ధిదారులకు, సంగివలస ప్రాంతంలో 10 బ్లాక్‌ల్లో 480 ఇళ్లు నిర్మించగా, తూర్పు నియోజకవర్గానికి 479 ఇళ్లు మంజూరు చేసి, వాటిలో 316 మంది లబ్ధిదారులకు కేటాయించారన్నారు. అయితే ఇప్పటి వరకు 9 బ్లాక్‌లు ఇంకా పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదన్నారు. అయితే ఇళ్లు కేటాయించామని, లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారని, బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి, వాటిని అప్పటి ప్రభుత్వం వాడుకుందని ఆరోపించారు. ఇప్పటి వరకు ఇళ్లు ఇవ్వకపోవడంతో బ్యాంకు అధికారులు నెలవారి వాయిదాలను చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అలాగే అందరికీ ఇళ్లు పేరిట లబ్ధిదారులు చాలా మంది డీడీలు చెల్లించారన్నారు. వారిలో నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వలేదని, నాలుగేళ్లుగా డీడీల మొత్తాన్ని కూడా వెనక్కి ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. జీవీఎంసీ యూసీడీ అధికారులైతే డీడీలు బ్యాంకుల్లో జమ చేయకుండా బీరువాల్లో దాచి ఉంచారని ఆరోపించారు. నాటి యూసీడీ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయమై కోర్టు ఆశ్రయించినా, కోర్టు తీర్పు ఇచ్చినా సరే నిజమైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గృహసముదాయాల్లో మౌలిక సదుపాయాలు, విద్యుత్ లేవని, మరోవైపు బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారని, దీంతో పేదల నలిగిపోతున్నారని పేర్కొన్నారు. నాటి టీడీపీ ఎమ్మెలను పార్టీ మార్చడం కోసం దక్షిణ నియోజకవర్గానికి చెందిన పార్టీ కార్యకర్తలకు అనకాపల్లిలో ఇళ్లు కేటాయించారని, పెందుర్తిలోనూ ఇదే తరహాలో జరిగిందని ఎమ్మెల్యే రామకృష్ణబాబు ఆరోపించారు. అందువల్ల నిజమైన లబ్ధిదారులను గుర్తించేందుకు విచారణ జరిపించాలని, అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా ముగిసిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు



కోలాటం నిర్వహిస్తున్న మహిళలు

వెంకోజీపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం కన్నుల పండువగా ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామస్థులందరూ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించుకున్నారు. మధ్యాహ్నం మహాఅన్నదానం చేపట్టారు. సుమారు వెయ్యి మంది పాల్గొన్నారు. సాయంత్రం మేళతాళాలు, వేదమంత్రాలతో అమ్మవారి ఊరేగింపు పురవీధులలో వైభవంగా సాగింది. సంఘం సభ్యులు, మహిళలు తలపై ఉత్సవ విగ్రహాలను మోస్తూ వీధులలో ఊరేగించారు. తీన్‌మార్, కోలాటం, సాముగరిడీలతో అమ్మవారిని ఊరేగించి సముద్రంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘం అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు, గౌరవ అధ్యక్షులు పీల వెంకట పరదేశినాయుడు, ఉపాధ్యక్షులు కర్రి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగరాజు, కార్యదర్శి ఆడారి.శివప్రకాష్, కోశాధికారి పొలమరశెట్టి త్రినాథ్, సహాయ కార్యదర్శులు కర్రి రఘు, రాజగిరి సురేష్, మహిళలు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులకు పసుపు, కుంకుమ సమర్పణ



కేంద్ర గౌరీ సేవా సంఘం సభ్యులను సత్కరించిన సీతారామ సేవా సంఘం సభ్యులు

వెంకోజీపాలెం, నవంబరు 16 : పాత వెంకోజీపాలెంలో శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో శనివారం కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు మళ్ల రవికుమార్ ఇతరులు గౌరీ పరమేశ్వరులకు పసుపు, కుంకుమలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీసీతారామ సేవా సంఘం వారు కేంద్ర సంఘం వారికి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, శ్రీ సీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు పీల వెంకట పరదేశినాయుడు, అధ్యక్షుడు ఆడారి పరదేశి నాయుడు, ఉపాధ్యక్షులు కర్రి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగరాజు, కోశాధికారి పొలమరశెట్టి త్రినాథ్, కార్యవర్గం ఆర్.సురేష్, మళ్ల కనకరాజు, గ్రామ సేవా సంఘం సభ్యులు మద్దాల వీర వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు

గ్రంథాలయ వారోత్సవాల్లో వ్యాస రచన పోటీలు



పోటీలు పాల్గొన్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంవీపీ కాలనీలోని నగర శాఖా గ్రంథాలయంలో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 6 నుంచి పదో తరగతి వరకూ పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. 'సెల్ ఫోన్ వినియోగం-విద్యార్థులపై ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీ ఏర్పాటు చేశారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి కేవీఏ ఉమామహేశ్వరరావు తెలిపారు.

'నైపుణ్యాభివృద్ధితో విస్తృత ఉపాధి అవకాశాలు'



అనిల్‌కుమార్‌కు సత్కరిస్తున్న ఏయూ ఆచార్యులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 'కెరీర్ కౌన్సెలింగ్, స్కిల్ డెవలప్‌మెంట్, ఇంటర్న్‌షిప్‌లో అవకాశాలు' అంశంపై ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగాధిపతి పేటేటి ప్రేమానందం ఆధ్వర్యంలో గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ప్రభుత్వం ప్రాంతీయ ఉపాధి అధికారి జోన్-1 టి.అనిల్‌కుమార్ హాజరయ్యారు. రాజనీతి, ప్రభుత్వ పాలనాశాస్త్రం చదువుతున్న విద్యార్థులు యునైటెడ్ నేషన్ ఆర్గనైజేషన్స్ నుంచి నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ వరకు ఎటువంటి ఉద్యోగ అవకాశాలను పొందవచ్చో వివరించారు. ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ప్రాజెక్టులను ఏ విధంగా వినియోగించుకోవాలని, ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవడం కోసం విద్యార్థులు కాలానుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో అధికారులు తీసుకువస్తున్న నూతన విధానాలు అర్థం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉద్యోగ అవకాశాల కోసం employment.ap.gov.in, ncp.gov.in అనే వెబ్‌సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. విభాగాధిపతి పేటేటి ప్రేమానందంమాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్‌లో నూతన విధానాలను అనుసరిస్తూ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తోందని, వాటిని ఉపయోగించుకుంటూ భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.



రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రాణి చంద్రమణి దేవి ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధి పెదవాల్తేరులోని రాణిచంద్రమణి దేవీ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగం, ల్యాబ్, వార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడ వైద్య సేవలు పొందుతున్న రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు గురించి తెలుసుకున్నారు. అనంతరం రోగులతో కాసేపు మాట్లాడారు. ఆస్పత్రి అంతా కలియతిరిగిన ఆయన అవసరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల హాజరు పట్టీ, అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ వివరాలు తెలుసుకోవడంతో పాటు ఇతర రికార్డులను పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతులు, రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, వారి పట్ల ప్రేమగా వ్యవహరించాలని హితవు పలికారు. వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు.

బాలల హక్కులపై పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాల వికాస్ ఫౌండేషన్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 19 నుంచి 21 వరకూ బాలల హక్కులపై అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బాలల హక్కుల రక్షణ అవగాహన శిబిరాల పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. 19న బీవీఎఫ్ స్కూలు 20న ఏయూ సోషల్ వర్క్ విభాగం, 21న అక్కయ్యపాలెం వాగ్దేవీ స్కూలులో అవగాహన శిబిరాలు నిర్వహించనున్నట్టు ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదేశ్వరరావు, డాక్టర్ బాబ్జీ, డాక్టర్ అప్పారావు, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఏయూ ప్రతిష్ఠ పెంచండి : వీసీ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, నవంబరు 16 : క్రీడల్లో ప్రతిభ చూపుతూ విద్యార్థులు ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను పెంచాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు అన్నారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్‌కు వెళ్తున్న విద్యార్థులను ఆయన అభినందించారు. క్రాస్ కంట్రీ మెన్, వుమెన్ క్రీడా బృందాలు బయలుదేరి బెంగుళూరుకు వెళ్లనున్నాయి. ఈ సందర్భంగా వీరిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రీడా విభాగాధిపతి ఆచార్య ఏ.పల్లవి, క్రీడా విభాగ సంచాలకులు ఎన్.విజయమోహన్, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, బాక్సింగ్ కోచ్ ఐ.వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడి పూజ



పడిపూజలో పాల్గొన్న స్వాములు

వెంకోజీపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసి ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం పడిపూజ(పదెనెట్టాంబడి) మహోత్సవం కన్నుల వేడుకగా నిర్వహించారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయం 5 గంటలకు లక్ష్మీగణపతి హోమం, 6 గంటలకు పంచామృతాభిషేకాలు, నెయ్యాభిషేకం, చందనం, విభూతి, కుంకుమ, నారికేల, వివిధ పండ్ల రసాల ఇత్యాది సుగంధ ద్రవ్యాలతో అయ్యప్ప స్వామికి అభిషేకాలు జరిపారు. అనంతరం విశేష అలంకరణతో స్వామివారి దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, బాల భాస్కర శర్మలు భక్తుల పడిపూజ అభిషేకం చేశారు. కార్యక్రమంలో బోర ధన రెడ్డి, కాళ్ల శంకర్, ఆడారి కామేశ్వరరావు, మద్దాల వీర వెంకట అప్పారావు, ఎస్.నరసింహారెడ్డి, పీల నాగేశ్వరరావు, పీల సాంబ, ఆడారి శ్రీనివాస్, సంఘ కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'విద్యా స్వేచ్ఛ'తో పాఠశాల్లో ఆధునిక వసతులు



సమావేశంలో మాట్లాడుతున్న చైతన్య, డీఎస్ రాజు తదితరులు

రామ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలల్లో 'విద్యా స్వేచ్ఛ' నినాదంతో ఆధునిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు వాల్తేర్ రౌండ్ టేబుల్ 92 చైర్మన్ చిన్నం చైతన్య తెలిపారు. రౌండ్ టేబుల్ ఇండియా వారోత్సవాల సందర్భంగా శనివారం బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 నుంచి 40 ఏళ్ల వయస్సు గల యువకులు స్వచ్ఛందంగా నాయకత్వం వహించే రౌండ్ టేబుల్ వ్యవస్థ ద్వారా పేద విద్యార్థుల్లో వెలుగు నింపుతామన్నారు. ఏటా నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా ఈనెల 11 నుంచి 16 వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో సంస్థ వైస్ చైర్మన్ డీఎస్ రాజు, కార్యదర్శి మోహిత్ రవి సింఘాల్, బూరుగుపల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

ఉపాధి సాధన, ఉద్యోగాల ఎంపికపై అవగాహన

ఎంవీపీ కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పేటెంట్ల ఫైలింగ్, రీసెర్చ్ ప్రాధాన్యం, కెరీర్ కౌన్సెలింగ్ తదతర అంశాలపై ఎంవీపీ కాలనీ గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఏయూ మైక్రోబయాలజీ విభాగం ఆచార్యులు వై.రవికిరణ్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. ఉద్యోగాల సాధనలో స్వయం ఉపాధి దృక్పథం, అభిరుచి, ఆసక్తిని అనుగుణంగా ఉద్యోగాల ఎంపిక, లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడం వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. సంస్థ డైరెక్టర్ గిరిధర్, ప్రిన్సిపాల్ కేఎస్ బోస్, అధ్యాపక బృందం శేష పద్మ, డాక్టర్ సుజాత, డాక్టర్ శ్యామల ప్రసంగించారు.

అర్జున అవార్డుకు ఎర్రాజీ జ్యోతి పేరు సిఫార్సు



విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత క్రీడారంగంలో ప్రతిష్టాత్మక అర్జున అవార్డుకు నగరానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి పేరు సిఫార్సు చేసినట్టు జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.నారాయణరావు తెలిపారు. అథ్లెటిక్స్ 100 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డులు నెలకొల్పడమే కాక అద్భుతమైన విజయాలతో దేశానికి పతకాలను అందించిన జ్యోతి పేరును ఈ అవార్డుకు సిఫార్సు చేయడం జిల్లా అథ్లెటిక్స్ సంఘానికి గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆమె విజయమే లక్ష్యంగా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఒలింపిక్స్‌కు చేరడం విశేషమన్నారు. అంకితభావం, పట్టుదలకు నిదర్శనంగా నిలిచి యువ క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చిందన్నారు. ఆమె ఘన విజయాలను లేఖతో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

కనకమహాలక్ష్మికి తులసి దళార్చన



జగదాంబ కూడలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మికి తులసీ దళార్చన సేవలను శనివారం ఆలయ అధికారులు నిర్వహించారు. ఆలయ అర్చకులు, దేవాలయ అధికారుల నేతృత్వంలో పూజలు జరిగాయి. సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని టీపీటీ కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బృందావనం పార్కులో ఆదివారం ఉచిత వైద్య, రక్త పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ ప్రెసిడెంట్ గొర్తి ప్రసన్న, కార్యనిర్వాహక సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నిపుణులైన వైద్యులతో ఉచిత వైద్య, రక్త పరీక్షలు, బీపీ, కొలెస్ట్రాల్, వైటల్ పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ప్రముఖ ఎండోక్రైనాలజీ వైద్యులు డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ కేబీ స్వామి హాజరవుతారని, శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21 నుంచి జాబ్‌మేళా

కంచరపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో 21 నుంచి నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి. రమణ తెలిపారు. క్యాంపస్ టు కార్పొరేట్ ఫర్ డిగ్రీ,డిప్లొమా, ఐటీఐ స్టూడెంట్స్ పేరుతో ప్రముఖ టైర్ల కంపెనీ ఎంఆర్ఎఫ్ ఈ మేళాలో పాల్గొని మౌఖిక పరీక్ష నిర్వహిస్తుంది. డిగ్రీ, డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులకు ఈ నెల 21, 22 తేదీల్లో పదోతరగతి, ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన వారికి 23, 24 తేదీల్లో మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారు. ఎంఆర్ఎఫ్ సంస్థ టీవీఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీ సౌజన్యంతో 'నేర్చుకో..సంపాదించుకో.. అభివృద్ధి చెందు' అన్న నినాదంతో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.రమణ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన స్టైఫండ్, అనంతరం వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు (మగ) ఆయా తేదీల్లో మౌఖిక పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

యువజనోత్సవాలకు 25న ఎంపిక

అల్లిపురం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో డిసెంబరు 16, 17 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సాహిత్య, సాంస్కృతిక యువజనోత్సవాల్లో పాల్గొనదలచిన రచయితలు, కళాకారులు నవంబరు 25న అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించే ఎంపిక కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కళలు ,సాహిత్యం పట్ల అభిరుచి గల నేటితరం యువకులను ప్రోత్సహించేందుకు యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో అచ్యుతరావు, యు.అప్పలరాజు, వై.రాంబాబు, యు.నాగరాజు, ఎస్.అప్పన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

సీతంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో స్థితప్రజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వైవీ సత్యనారాయణ, శేషగిరిరావు, వై.విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ పార్క్‌లో హనుమాన్ చాలీసా

మాధవధార, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాధవధార కళింగనగర్ ఈస్ట్ పార్క్‌లో శనివారం హనుమాన్ చాలీసా భక్తి కార్యక్రమం నిర్వహించారు. పూర్వాంచల్ కీర్తన భజన్ మండలి సభ్యులు చేపట్టిన ఈ కార్యక్రమంలో స్థానికులు, పార్కు వాకర్లు పాల్గొన్నారు. పార్కులో కొత్తగా నిర్మించిన ఆడిటోరియంలో ఈ హనుమాన్ చాలీసా భజన సాయంత్రం 6 గంటలకు నిర్వహించారు. పార్కు కమిటీ అధ్యక్షులు బి.మురళీకృష్ణ, సభ్యులు, స్థానిక మహిళా క్లబ్ సభ్యులు హాజరయ్యారు.

అకృత్యాలకు అడ్డాగా సరస్వతీ పార్కు!

డాబాగార్డెన్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పార్కు అంటే... నగరంలో తెలియనివారుండరు. అలాంటి ఈ పార్కు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. పార్కులో ఆసనాల వెనుక, ఆహ్లాదాన్ని పంచే మొక్కల్లోనూ మద్యం సీసాలు కనిపించడంతో సందర్శకులు అవాక్కవుతున్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని సరస్వతీ పార్కులో రాత్రివేళ సమస్య మరింత జటిలంగా తయారైంది. ఆకతాయిలకు ఈ పార్కు ఎంచక్కా ఉపయోగపడుతుంటే... స్థానికులు, సందర్శకులకు మాత్రం రోత పుట్టిస్తోంది. పార్కులోని ఆహ్లాదాన్ని ఆస్వాదించాలని అడుగు పెడితే. మద్యం సీసాలు, సిగరెట్టు ప్యాకెట్లు కనిపించడంతో మహిళలు, చిన్నారులు చీదరించుకుంటున్నారు. ఇందులోని ఓపెన్ జిమ్ చేద్దామని వచ్చిన వారికి అసౌకర్యంగా ఉండడంతో వెనుదిరుగుతున్నారు. సందర్శకులు ఎక్కువ సేపు కూర్చునేందుకు ఆసక్తి చూపడం లేదు. కూతవేటు దూరంలోనే జీవీఎంసీ జోనల్-4 కార్యాలయం, మరికొంతదూరంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. నిరంతర పర్యవేక్షణ, రాత్రివేళ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మందుబాబులు ప్రవేశించే పార్కు దక్షిణవైపు భాగం



బెంచీల వెనుక మద్యం సీసాలు

చిన్నారులతో రాలేకపోతున్నాం

సాయంత్రం వేళలో పార్కులో కూర్చోవాలంటే అసౌకర్యంగా ఉంటోంది. రాత్రి వేళ ఎవరూ లేని సమయంలో మద్యం సీసాలు, సిగరెట్లు, ఇతర వ్యర్థాలను చెట్లులో విసురుతున్నారు. వాటిని చూసిన వెంటనే తిరిగి ఇంటికి వెళ్లిపోవాలనిపిస్తోంది. చిన్నారులతో రావడం ఇబ్బందికరంగా ఉంటోంది.

- ప్రణీత, స్థానికురాలు

పర్యవేక్షణ అవసరం

పార్కులో రాత్రి వేళ పర్యవేక్షణ ఉండాలి. నిత్యం విద్యుత్ దీపాలు వెలిగితే ఇతర వ్యక్తులు రావడానికి అవకాశం ఉండదు. అధికారులు భద్రత చర్యలు తీసుకుంటే అన్ని వర్గాల వారు పార్కును సద్వినియోగం చేసుకునే అవకాశం కలుగుతుంది.

- ఎం.సూరిబాబు, డాబాగార్డెన్స్

నర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఆరా



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్సింగ్ సంఘం సభ్యులు

మహారాణిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షురాలు టి.గంగాభవానీ నాయకత్వంలో సభ్యులు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసిన గంగాభవానీ కలెక్టర్‌కు సభ్యులను పరిచయం చేశారు. అనంతరం కలెక్టర్ వారితో మాట్లాడుతూ నర్సింగ్ ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షురాలు ఇందిర, కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా ఉన్న డివైడర్ తొలగింపు

సీతమ్మధార, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రహదారికి అడ్డంగా వేసిన డివైడర్‌ను ట్రాఫిక్ పోలీసులు ఎట్టకేలకు తొలగించారు. అర్ధరాత్రి డివైడర్ ఏర్పాటు ఎవరి కోసం? శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికల్లో ఈ నెల 14న వార్త ప్రచురించడంతో స్పందించిన పోలీసులు డివైడర్‌ను జేసీబీ సహాయంతో తొలగించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

'కవితానుభూతికి హద్దులు లేవు'



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ డి.వి. సూర్యారావు

సీతంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం 'పుస్తకం.. గ్రంథాలయం' అనే అంశంపై కవితా గోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విశిష్ట అతిథి బమ్మిడిశెట్టి చక్రపాణి మాట్లాడుతూ కవితానుభూతికి హద్దులు లేవని, కవిత నేటి వాస్తవమే కాక భవిష్యత్ వాగ్దానం అని పేర్కొన్నారు. రచయిత అడపా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవితా గోష్ఠిని డాక్టర్ మరడాని సుబ్బారావు సమీక్షించి, కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రచయితలు, కవులు, సాహితీప్రియులు రాధారాణి, డాక్టర్ నిర్మలాదేవి, భాగవతుల శాస్త్రి, డాక్టర్ డి.వి. సూర్యారావు, చిన్ని సూర్యనారాయణ, గౌరీపతి శాస్త్రి, ఉప్పల అప్పలరాజు తదితరులు కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్ రెడ్డి, సుసర్ల సర్వేశ్వరశాస్త్రి, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా అంబలం పూజ

సీతమ్మధార, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా అయ్యప్ప భక్తులు బి. రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అంబలం పూజ కన్నుల పండువగా నిర్వహించారు. మందిరాన్ని సుందరంగా అలంకరించారు. అయ్యప్ప స్వామి మందిరం ప్రారంభం సందర్భంగా ఉన్నికృష్ణన్ స్వామి పర్యవేక్షణలో మొదటి పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. దీనికి ఆర్థిక సహాయం చేసిన పారిశ్రామికవేత్తలు గోవింద్, పరుశురామ్‌రాజు, స్వాతి రమేష్ రెడ్డి, డీవీఎస్ ప్రసాద్ రెడ్డి విచ్చేశారు. అయ్యప్ప భక్తులు పాటలతో అలరించారు.

అన్నదానం గణేష్‌నగర్‌లో గురుస్వామి గిరి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ నారా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సుందరంగా అలంకరించిన అయ్యప్ప అంబలం, భక్తులు

పుష్పాభిషేకం

అక్కయ్యపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి ఎదురుగా ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలోని ఉపాలయంలో వేంచేసిన అయ్యప్పస్వామికి శైవ ఆగమ సంప్రదాయంలో మంగళ ధ్వని వేదమంత్రాలతో ఆలయ అర్చకుడు గురుస్వామి బాలానంద శివాచార్య స్వామి వివిధ రకాల పుష్పాభిషేకాన్ని వేదోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తిరువీధి మహోత్సవాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పి.వేణుగోపాల్, గురుపాద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



అలంకరణలో అయ్యప్పస్వామి

'ఎస్సీ సబ్ ప్లాన్ బడ్జెట్ రూ.34 వేల కోట్లకు పెంచండి'

సీతంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రద్దు చేసిన అన్ని సంక్షేమ పథకాల పునరుద్ధరణకు సరిపడా ఎస్సీ సబ్ ప్లాన్ బడ్జెట్ రూ.34 వేల కోట్లకు పెంచాలని విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. రామాటాకీస్ రోడ్డు సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బడ్జెట్ కేటాయింపులపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ తెరవడం సంతోషమే కానీ... కేవలం రూ.341 కోట్లు కేటాయించడం సరికాదని, దాన్ని రూ.1000 కోట్లకు పెంచాలన్నారు. విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని, ఎస్సీల ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలని కోరారు. సుమారు 10 సవరణలను ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. సభకు హాజరుకాని వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోడదాసి సుధాకర్, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారి చొరవతో ఆర్పీపేట పాఠశాలకు మంచినీటి సౌకర్యం

కంచరపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలను జిల్లా డిప్యూటీ డీఈవో అంబటి సోమేశ్వరావు శనివారం సందర్శించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన 'ఆర్పీపేట ఉన్నత పాఠశాల్లో దాహం..దాహం..' కథనం చదివిన సోమేశ్వరావు పాఠశాలను సందర్శించి ఆర్వో ప్లాంట్‌ను చూసి మరమ్మతులకు చర్య తీసుకుంటామని తెలిపారు. ఆయన సూచన మేరకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా జీవీఎంసీ అధికారులు మినరల్ వాటర్‌ను పాఠశాలకు పంపారు. అనంతరం డిప్యూటీ డీఈవో ఉపాధ్యాయ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సెల్ఫ్ అసెస్‌మెంట్ మార్కుల వివరాలను తక్షణమే పూర్తిచేయాలని ఆదేశించారు. హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వెలమల సమస్యలు పరిష్కరించాలి'

మహారాణిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెలమ సామాజిక వర్గాన్ని బి.సి. 'డి' నుంచి 'ఎ'లోకి మార్చి తగిన గుర్తింపు ఇవ్వాలని రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవింద్ కోరారు. వెలమ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పలువురు మంత్రులు, డిప్యూటీ స్పీకరును శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందించినట్లు శనివారం ఇక్కడ తెలిపారు. గోవింద్ మాట్లాడుతూ తాటిపూడి జలాశయానికి గొర్రుపాటి బుచ్చిఅప్పారావు పేరును కొనసాగించాలని, రాష్ట్రంలో బి.సి.ల కుల గణన చేపట్టాలని, విదేశాల్లో ఉన్నత చదువుల కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజులు హామీ ఇచ్చారని గోవింద్ తెలిపారు.



మంత్రి అచ్చెన్నాయుడుతో కరచాలనం చేస్తున్న లగుడు గోవింద్ తదితరులు

తైక్వాండోలో ధనుష్‌కు పతకం



ధనుష్‌ను అభినందిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ అండర్-14 బాలుర తైక్వాండో టోర్నీలో నగరంలోని గోపాలపట్నం ప్రాంత పాఠశాలకు చెందిన అక్కిరెడ్డి వెంకట ధనుష్ పతకం సాధించాడు. మధ్యప్రదేశ్‌లోని విదిషాలో జరిగే ఈ టోర్నీలో బాలుర 35-38 కిలోల విభాగంలో ధనుష్ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ తన కార్యాలయంలో ధనుష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వి.దేముడు, తైక్వాండో కోచ్ సీహెచ్.ప్రసన్న పాల్గొన్నారు.

చంద్రబాబును నిర్బంధించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

మర్రిపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు విశాఖ విచ్చేసిన ప్రస్తుత సీఎం చంద్రబాబును అడ్డుకుని తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన వైసీపీ నాయకులు కె.కె.రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్, కోలా గురువులు, ఆళ్ళ శివగణేష్‌లపై చర్యలు తీసుకోవాలని జిల్లా టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి కోరారు. శనివారం ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్‌లో సీఐ చక్రధరరావుకు ఫిర్యాదు అందజేశారు. ఫిర్యాదును పరిశీలించి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని సీఐ చెప్పినట్లు కె.గోపాల్‌రెడ్డి తెలిపారు.

నారీమణుల 'జిమ్' బాట

... 5వ పేజీ తరువాయి

కిలోల వరకు బరువు తగ్గినట్టు జ్యోత్స్న అనే ఆమె చెప్పారు. జిమ్‌కు వస్తున్న ప్రతి వంద మంది మహిళల్లో 30 మంది విద్యార్థినులు, మరో 30 మంది గృహిణులు, మరో 30 మంది వరకు ఉద్యోగినులు ఉంటుండగా, పది మంది పదేళ్లలోపు బాలికలు ఉంటున్నారు. బాలికలు స్పోర్ట్స్ కోసం జిమ్‌లో చేరి శరీర ఆకృతిని మార్చుకుంటున్నారు. నగరంలో జిమ్‌ను బట్టి నెలకు రూ.1500 నుంచి రూ.2500 వరకూ ఫీజు తీసుకుంటున్నారు. మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాది ప్యాకేజీలు కూడా ఉంటాయి. జిమ్‌లో చేరే మహిళలు తప్పనిసరిగా రోజుకు కనీసం రెండు గంటలు సమయాన్ని కేటాయించాల్సి ఉంటుంది.

ఇవీ వర్కౌట్స్..

మహిళల సమస్యలు, అవసరాలను బట్టి వర్కౌట్స్ చేయిస్తామని ట్రైనర్స్ చెబుతున్నారు. ఎక్కువగా స్ట్రెంత్ ట్రైనింగ్, హీట్ వర్కవుట్స్, బాడీ టోనింగ్, ఫ్యాట్ లాస్, వెయిట్ లాస్/గెయిన్ వర్కౌట్స్ చేయిస్తుంటారు. జిమ్‌లో చేరే మహిళలు తప్పనిసరిగా డైట్ కూడా ఫాలో కావాల్సి ఉంటుంది. పర్సనల్ ట్రైనర్స్ డైట్‌కు సంబంధించి మెనూ చెబుతారు. ఒకవైపు వర్కౌట్స్ చేస్తూనే డైట్ పాటించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చు.

కళకళలాడుతున్న జిమ్‌లు..

ఒకప్పుడు జిమ్‌లు పురుషులపైనే ఆధారపడి ఉండేవి. ఇప్పుడు మహిళలు కూడా భారీగా వస్తుండడంతో అందుకు అనుగుణంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల ప్రత్యేకంగా మహిళల కోసం జిమ్స్‌లు నిర్వహిస్తున్నారు. మహిళల కోసం ఫిట్‌నెస్ ట్రైనర్స్‌ను నిర్వాహకులు నియమించుకుంటున్నారు. కొన్నిచోట్ల పురుష ట్రైనర్సే మహిళలతో వర్కౌట్లు చేయిస్తుంటారు. ఒకప్పుడు జిమ్ అంటే ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే తెరిచి ఉండేది. ఇప్పుడు 24 గంటలు రన్ చేస్తున్నారు. మహిళలు ఎప్పుడు కావాలంటే అప్పుడు చేసుకునే వెసులుబాటును జిమ్ నిర్వాహకుల కల్పిస్తున్నారు.

మహిళల సంఖ్య పెరిగింది



గతంతో పోలిస్తే జిమ్‌కు వస్తున్న మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. గడిచిన మూడేళ్లలో 20 నుంచి 30 శాతం మంది మహిళలు జిమ్‌కు వస్తున్నారు. మహిళల్లో ఆరోగ్యం పట్ల పెరిగిన శ్రద్ధ, ఫిట్‌గా ఉండాలన్న ఆకాంక్ష ఇందుకు కారణమవుతున్నాయి. రోజువారీ కొన్ని వర్కౌట్స్ చేయడం ద్వారా బరువు తగ్గడంతోపాటు ఫిట్‌గా మారవచ్చు. ఇందుకోసం కనీసం రెండు గంటలు సమయాన్ని కేటాయించాల్సి ఉంటుంది. జిమ్‌లో కష్టపడడంతోపాటు డైట్ విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అప్పుడే మెరుగైన ఫలితాలు వస్తుంటాయి.

- ఎల్.మోహనరావు
ఫిట్ ట్రైనర్, మారుతీ జిమ్ అధినేత
అక్కయ్యపాలెం

జోరుగా విమానయానం

... 5వ పేజీ తరువాయి

చేయగా, ఈ ఏడాది అక్టోబరులో 2,52,499 మంది (8.83 శాతం ఎక్కువ) రాకపోకలు సాగించారు. విమానాల లెక్కలు పరిశీలిస్తే గత ఏడాది అక్టోబరులో విశాఖ నుంచి 1,732 విమానాలు నడవగా, ఈ ఏడాది అక్టోబరులో 1,855 విమానాలు నడిచాయి. వీటిలో 7.1 శాతం వృద్ధి నమోదైంది.

వింటర్ షెడ్యూల్‌లో మరో మూడు సర్వీస్‌లు

అక్టోబరు 28వ తేదీ నుంచి కొత్త వింటర్ షెడ్యూల్ అమలులోకి వచ్చింది. అంతకు ముందు రోజుకు 32 విమానాలు అందుబాటులో ఉండగా, ఇప్పుడు మరో మూడు పెరిగాయి. అంటే ఇటు నుంచి వెళ్లేవి 35 అయితే, అటు నుంచి వచ్చేవి మరో 35. రోజుకు 70 విమానాల కింద లెక్క. ప్రయాణికుల సంఖ్య కూడా దానికి తగ్గట్టుగానే పెరుగుతోంది. **- రాజారెడ్డి, విమానాశ్రయం డైరెక్టర్**

కోడి వ్యర్థాల కాంట్రాక్టు కోసం పట్టు

... 5వ పేజీ తరువాయి

వాటి కోసం పోటీపడడం మొదలెట్టారు. ఇది నగరంలో చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించే కాంట్రాక్టు పొందినవారికి వరంగా మారింది. కాపులుప్పాడలోని యార్డుకు తరలించకుండా, జీవీఎంసీ అధికారులను మేనేజ్ చేసుకుని వ్యర్థాలను నేరుగా చేపల చెరువులకు తరలించడం ప్రారంభించారు. దీనివల్ల చికెన్ వ్యర్థాలను సేకరించే కాంట్రాక్టర్లకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. చికెన్ వ్యర్థాలను సేకరించేందుకు జీవీఎంసీ అప్పగించిన కాంట్రాక్టు గడువు ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగియడంతో కొత్తగా టెండర్లు పిలవాలని నిర్ణయించింది. ఆగస్టులో జోన్‌ల వారీగా ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు పిలిచింది. సెప్టెంబరు ఆరున టెండర్లు తెరిచి అర్హులైన వారికి పనులు అప్పగిస్తామని నోటీసులో పేర్కొంది. అయితే టెండర్ నోటిఫికేషన్ విషయం తమకు తెలియలేదు కాబట్టి, గడువు పెంచాలంటూ కొంతమంది కార్పొరేటర్లు జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. దీంతో అక్టోబరు ఐదు వరకూ టెండరు దాఖలుకు అవకాశం కల్పించారు. 6న టెండర్లు తెరుస్తామన్నారు.

ప్రజాప్రతినిధుల జోక్యంతో ఆగిన ప్రక్రియ

కోడి వ్యర్థాల సేకరణ కాంట్రాక్టు దక్కితే భారీగా సంపాదించవచ్చునని భావించి టెండర్‌లో పాల్గొన్నవారు కొందరు నగరంతోపాటు అనకాపల్లి జిల్లాలో తమకు తెలిసిన నేతలను కలిసి తమకు దక్కేలా చూడాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతో ప్రజా ప్రతినిధులు జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి చికెన్ వ్యర్థాల కాంట్రాక్టు తాము సూచించిన వారికి వచ్చేలా చూడాలని ఆదేశిస్తున్నారు. నగరానికి చెందిన ఇద్దరు ప్రజా ప్రతినిధులు, మరొక మాజీ ప్రతినిధి నేరుగా సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి తాము చెప్పినవారికి కనీసం ఒక్కో జోన్ కాంట్రాక్టు దక్కేలా చూడాలని ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది. రూరల్ జిల్లాకు చెందిన మరో ప్రజా ప్రతినిధి కూడా జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి చాలాకాలంగా పార్టీ కోసం పని చేసిన వ్యక్తి చికెన్‌వ్యర్థాల సేకరణకు టెండర్ వేశారని, కచ్చితంగా ఒక జోన్ ఆయనకు ఇప్పించాల్సిందేనని చెప్పినట్టు సమాచారం. అయితే నిబంధనలకు విరుద్ధంగా టెండర్ ఖరారు చేస్తే తాము ఇబ్బంది పడాల్సి వస్తుందని అధికారులు భయపడుతున్నారు. అందుకే గత నెల ఆరున తెరవాల్సిన టెండర్లను ఇంతవరకూ తెరవకుండా పక్కనపెట్టేశారు. ఈ విషయం ఒక అధికారి వద్ద ప్రస్తావించగా, ఉన్నతస్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయని, ఏం చేయాలో దిక్కుతోచక ముందుకు వెళ్లడం లేదని సమాధానం ఇచ్చారు.

బడ్డీల తొలగింపులో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

బడ్డీల తొలగింపునకు జీవీఎంసీ అధికారులు వంద మంది కూలీలను తీసుకుని రావడం విశేషం. వారంతా బడ్డీలు ధ్వంసం చేస్తుంటే అక్కడకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు తాళ్లతో రక్షణ వలయం తయారుచేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగించి సుమారు 300 దుకాణాలను తొలగించారు. దీంతో వార్డులో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చిరు వర్తకులు ఆగ్రహంతో తొలగింపును అడ్డుకోవడానికి యత్నించారు. అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. అవే తమకు బతుకుదెరువని, బడ్డీలు తీయొద్దని మొరపెట్టుకున్నారు. అయితే వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి హైకోర్టులో కేసు వేశారని, ఆక్రమణలు తొలగించాలని న్యాయస్థానం ఆదేశాలిచ్చిందని అందుకే తొలగిస్తున్నామని జీవీఎంసీ అధికారులు సమాధానమిచ్చారు. దీంతో బాధితులు పెద్దఎత్తున మూర్తియాదవ్ ఇంటిని ముట్టడించడానికి ర్యాలీగా బయలుదేరారు. వారంతా మూర్తి యాదవ్ ఇంటి వద్దకు చేరుకోగా అక్కడ భారీగా మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. ఇంటిని ముట్టడిస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. దీంతో మూర్తియాదవ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు బాధితులు వార్డులో ర్యాలీ నిర్వహించారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

22వ వార్డులో స్ట్రీట్ వెండర్స్ యాక్ట్‌కు విరుద్ధంగా రోడ్డు మార్జిన్ దాటి జరిగిన ఆక్రమణలపై జీవీఎంసీ చర్యలు తీసుకోవడం లేదని కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలు చేశారు. ఆయన పిల్ మేరకు హైకోర్టు జీవీఎంసీకి నోటీసులు జారీచేసింది. హైకోర్టు నోటీసులకు జీవీఎంసీ అధికారులు కౌంటర్ దాఖలు చేయలేదు. దీంతో స్ట్రీట్ వెండర్స్ యాక్ట్‌కు లోబడి రోడ్డు మార్జిన్ దాటిన ఆక్రమణలు మాత్రమే తొలగించాలని మే 10న హైకోర్టు ఆదేశాలిచ్చింది. అయితే నగరంలో స్ట్రీట్ వెండర్స్ యాక్ట్ అమలులోనే లేదు. ఈ యాక్ట్ ప్రకారం వీధి వ్యాపారులకు హాకర్స్ జోన్ ఏర్పాటుచేయాలి. రోడ్డు వెడల్పు ఆధారంగా తెలుపు సున్నంతో మార్జిన్ గీతలు గీసి అందులోనే వ్యాపారాలు చేసుకోవలసిందిగా సూచించాలి. జీవీఎంసీ వీధివ్యాపారులకు గుర్తింపు కార్డులిచ్చి వ్యాపార రక్షణ కల్పించాలి. ఇవేమీ 22వ వార్డులో అమలులో లేకపోయినా మార్జిన్ దాటిన ఆక్రమణలు మాత్రమే తొలగించాలని హైకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి మరీ మొత్తం శివాజీపాలెం, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెంలో ఎక్కడా ఒక్క దుకాణం లేకుండా పూర్తిగా తొలగించారు.

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్



విజేతలతో కళాశాల అధ్యాపకులు

జ్ఞానాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర కళాశాలల మహిళా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలను ఏయూ ఫిజికల్ డైరెక్టర్ ఆచార్య విజయమోహన్ ప్రారంభించారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థినులు పోటీల్లో పాల్గొనగా బుల్లయ్య కళాశాల, సెయింట్ జోసెఫ్ కళాశాలల విద్యార్థినులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ తెలిపారు. అనంతరం విజేతలకు షీల్డ్‌లు,ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డా.పీకే జయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ డా. ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానానికి తూట్లు!

ఆటో ఇసుక రూ.1,800

పారిశ్రామిక ప్రాంతంలో జోరుగా సాగుతున్న వ్యాపారం


లారీలో తెచ్చిన ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం

మల్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పారి శ్రామిక ప్రాంతంలో ఇసుక ఉచిత విధానానికి పలువురు వ్యాపారులు తూట్లు పొడుస్తున్నారు. అక్రమంగా ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. ఒక ఆటో ఇసుక రూ.1,800కు విక్రయిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలకు అని చెప్పుకొని డంపింగ్ కేంద్రాల నుంచి ఇసుక తీసుకువస్తూ పలుచోట్ల నిల్వ చేస్తూ యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఒకపక్క ఇసుక ఉచితంగా అందిస్తామంటూ ప్రభుత్వం ప్రచారం చేస్తుండగా, ఈ ప్రాంతంలో ఇసుకాసురులు రెచ్చిపోవడం గమనార్హం. దీనిపై అధికారులు కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాం తంలో కొందరు బిల్డర్‌లు ఇసుక వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ఒడిశా ప్రాంతం నుంచి ఇసుకను పెద్ద పెద్ద లారీలతో రప్పించి, ఆ ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తూ అవసరమైన వారికి అమ్మకాలు జరుపుతున్నారు. నిర్మాణంలో ఉన్న చోటకే ఇసుకను పంపిస్తున్నారు.

ఇదంతా బహిరంగ రహస్యమే. అయినప్పటికీ అధికారులు ఏమీపట్టనట్టు వ్యవహరిస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్ర తినిధులు స్పందించి ఇసుక అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

›› బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు


సమావేశంలో మాట్లాడుతున్న పూడి తిరుపతిరావు

గాజువాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి సంస్థాగతంగా ఎన్నికలు నిర్వహించాలని, కమిటీల నిర్మాణంలో కార్యకర్తలను భాగస్వాముల్ని చేయాలని సూచించారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యమిచ్చేలా కమిటీల నియామకం జరగాలని తిరుపతిరావు పేర్కొన్నారు. గాజువాకలో రికార్డు స్థాయిలో 37 వేల వరకు పార్టీ సభ్యత్వాలను నమోదు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు జీలకర్ర రమణ, లలిత, బొండా యల్లజీరావు, దీనంకొండ కృష్ణంరాజు, నూకరాజు, సోంబాబు, తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎంఈవో శ్రీనివాసరావు

పెదగంట్యాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శ్రీనివాసరావు కోరారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అందరూ అన్ని పుస్తకాలు కొనుగోలు చేయలేరని, అటువంటివన్నీ లభ్యమయ్యే గ్రంథాలయాలు అందరికీ ఎంతో ఉపయక్తంగా ఉంటాయన్నారు. ఎంఈవో-2 రమణాజీ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కరెంట్ ఎఫైర్స్, చరిత్ర, ఇతర సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయాల్లోనే లభ్యమవుతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహణాధికారి పీవీ రమణ, పలువురు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

గాజువాక గ్రంథాలయంలో కవి సమ్మేళనం

గాజువాక: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా శనివారం ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనాన్ని చేపట్టారు., కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సాహిత్యసుధ వ్యవస్థాపకులు అద్దంకి రాఘవాచార్యులు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని పేర్కొన్నారు. యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బి.చంద్రకళ, వివిధ సంఘాల ప్రతినిధులు తుంపాల శ్రీరామ్మూర్తి, సీహెచ్ విశ్వనాథరాజు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయోద్యమ నాయకులకు నివాళి

గోపాలపట్నం: గ్రంథాలయోద్యమ నాయకులు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, షియాలి రామామృత రంగనాథన్ చిత్రపటాలకు స్థానిక శాఖా గ్రంథాయలాధికారి ఎన్‌వీ నరసింహం, కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో గ్రంథాలయోద్యమ నాయకుల పాత్ర ఎంతో కీలకమైనదని వారన్నారు. కార్యక్రమంలో పారిశ్రామిక శిక్షణ సంస్థ విశ్రాంత ప్రిన్సిపాల్ డి.జాకబ్ రాజు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు



పెందుర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్, 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం పెందుర్తిలోని ఆయన స్వగృహంలో కేకు కోస్తారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం, వృద్ధాశ్రమంలో పలు సేవా కార్యక్రమాలు చేపడతారు. పీలాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ పెందుర్తి జంక్షన్‌లో ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు బ్యానర్లు, కటౌట్, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

పెందుర్తి-రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటరు 95వ వార్డు చీమలాపల్లిలో నిర్వహిస్తున్న శ్రీగౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. ఆఖరి రోజు సంఘం అధ్యక్షుడు యల్లపు పరదేశినాయుడు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు.

కార్తీక పాఢ్యమి పూజలు

కూర్మన్నపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక పాఢ్యమి సందర్భంగా 87వ వార్డు కణితి పద్మశాలీవీధిలో ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అఖండ దీపారాధనలు, సామూహిక పూజలు నిర్వహించారు.


శోభాయమానంగా అలంకరించిన 18 మెట్లు...పడి పూజలో పాల్గొన్న భక్తులు. (ఇన్‌సెట్లో) అయ్యప్పస్వామి

అయ్యప్ప ఆలయంలో వైభవంగా పడిపూజ

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప స్వామి పడి పూజను వైభవంగా నిర్వహించారు. కేరళలోని సన్నిదానంలో అయ్యప్ప మండల పూజ ప్రారంభమైన సందర్భంగా టౌన్‌షిప్‌లో గల ఆలయంలోనూ భారీ ఎత్తున పడిపూజను జరిపారు. వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కేరళలోని సన్నిదానంలో నిర్వహించినట్టుగానే ఇక్కడ కూడా ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పూజలు, అభిషేకాలు, పుష్ప, వృక్ష పూజలను చేపట్టారు. అనంతరం అయ్యప్ప పడిని వెలిగించి, భక్తులకు హారతిని అందజేశారు. సుమారు ఐదు వేల మంది భక్తులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గాయకులు పలు భజన గీతాలను ఎంతో ఉత్సాహంగా ఆలపించారు. ఆ తర్వాత భక్తులకు సద్ది ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ అధికారులు, కార్మిక సంఘ నాయకులు, ఉద్యోగులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా ఇరుముడి కట్టుకున్న స్వాములకు 18 మెట్ల దర్శనం కల్పిస్తామని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

దుగ్గపువానిపాలెంలో ఘనంగా దానప్పతల్లి పండగ



కూర్మన్నపాలెం,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాళింగుల ఆరాధ్య దైవం దానప్పతల్లి పండగను శనివారం 87వ వార్డు దుగ్గపువానిపాలెంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సహస్ర కలశాలతో, 516 రకాల పిండివంటలతో అమ్మ వారి సారెను దుగ్గపువానిపాలెం, రాజులపాలెం, కాశీపాలెం, కణితి, వడ్లపూడి మీదుగా ఊరేగింపుగా తీసుకువచ్చి నివేదించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, సింహాద్రి ప్రాపర్టీస్ ఛైర్మన్ సిగిలిపల్లి రవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాగింది. గంగిరెద్దుల డాన్స్‌లు, కోలాటాలు, తప్పెటగుళ్లు,చిడతలు,వివిధ జానపద నృత్యాలుతో భక్తజనం మధ్య, భజన గీతాలు ఆపిస్తూ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ప్రతినిధులు కొండలరావు, డీవీ అప్పారావు, పి.వేణుబాబు, బీఏ సత్యం, ఎం.దామోదర్, డి.దానప్పలు, సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన ర్యాలీ

పెందుర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాయి హెల్పింగ్ హ్యాండ్స్, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పెందుర్తిలో అవయవ దానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, యువత, సేవా సంస్థలను భాగస్వాములను చేస్తూ వెయ్యి మందితో ర్యాలీ చేపట్టారు. కూడలిలో ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని అవగాహన కలిగించారు. అవయవదానంతో 'మరణంలోనే జీవనం' అంటూ నినదించారు. అనంతరం స్థానిక శాంతికల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సదస్సులో జీవన్ దాన్ సమన్వయకర్త కె.రాంబాబు, కేజీహెచ్ పర్యవేక్షణాధికారి శివానంద్, అఖిల భారత అవయవ దాతల సంఘ గౌరవ అధ్యక్షురాలు గూడురు సీతామహాలక్ష్మి అవయవ దానం ఆవశ్యకతను వివరించారు. అవయవ దాతల సభ్యత్వాన్ని నమోదు చేశారు.

58 డిఫెన్స్ మద్యం సీసాలు పట్టివేత

గాజువాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన 58 డిఫెన్స్ మద్యం బాటిళ్లను గాజువాక ఎక్సైజ్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాక శ్రీకన్య థియేటర్ ప్రాంతంలో గెంబలి శేఖర్ అనే వ్యక్తి డిఫెన్స్ మద్యం సీసాలు కలిగి ఉన్నాడనే సమాచారంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో గాజువాక సీఐ నాగ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు ముసలినాయుడు, నరసింహామూర్తిలు దాడి చేసి 58 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి: జెడ్సీ

వేపగుంట నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ వేపగుంట జోన్ కార్యాలయ పరిధిలో ఉన్న మాంసం దుకాణదారులు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని జోన్-8 జెడ్సీ కె.హైమావతి పేర్కొన్నారు. ఇక్కడి జీవీఎంసీ కల్యాణ మండపంలో శనివారం చికెన్, మటన్ మాంస విక్రయదారులుకు పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే ఇబ్బందులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ పాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి తీవ్ర అఘాతం ఏర్పడుతున్నందున డిసెంబరు ఒకటి నుంచి దీనిని పూర్తిగా నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో బి.అప్పలనాయుడు, శానిటరీ సూపర్‌వైజర్ కె.వెంకటరమణ, పలువురు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రీ మెచ్యూర్ పిల్లల ఆరోగ్యంపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నెలల నిండకముందే పుట్టే పిల్లల విషయంతో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సకాలంలో వైద్య సహాయం తసుకుంటే వారికి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రముఖ నీయోనాటాలజిస్టు డాక్టర్ నిఖిల్ తెన్నేటి అన్నారు. ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ డే సందర్భంగా షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో శనివారం ప్రీ మెచ్యూర్ పిల్లల అరోగ్య పరిరక్షణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, స్థానికులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

మల్కాపురం, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం కుంచమ్మ కాలనీలో నిర్మించిన సామాజిక భవనాన్ని మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భవనాన్ని సామాజిక భవనాన్ని శుభ కార్యక్రమాల కోసం వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పొత్తబత్తుల శ్రీనివాసరావు, రజక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు) 56, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 28, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 30, క్యారెట్ 62 దొండకాయలు 30, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 50, మునక్కాడలు (కిలో) 74, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 56, పొటల్స్ 50, కీరదోస 28, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, మామిడి కాయలు 100, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

నెలలు నిండకుండానే...

అవగాహనతో ప్రీమెచ్యూరిటీ ప్రసవాలకు చెక్

గర్భం దాల్చినప్పటి నుంచి పోషకాహారం తీసుకోవాలి



- నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకుంటుండాలి
- ముందే ప్రసవం అయితే అనేక రకాల సమస్యలు
- నేడు ప్రీమెచ్యూరిటీ డే

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సాధారణంగా గర్భం దాల్చిన 40 వారాలకు ప్రసవం జరగాలి. అయితే, కొంతమంది 27 నుంచి 36 వారాల మధ్య ప్రసవిస్తున్నారు. ఇటువంటి సందర్భాల్లో పుట్టే చిన్నారులను ప్రీమెచ్యూర్ బేబీ (నెలలు నిండకుండా పుట్టే పిల్లలు) అంటారు. ఈ తరహా ప్రసవాల్లో శిశువులకు అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. అయితే, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం, గర్భం దాల్చిన తరువాత నిరంతరం వైద్య పరీక్షలు చేయించడం ద్వారా ఈ తరహా ఇబ్బందులను ముందుగానే గుర్తించేందుకు అవకాశం ఉంది. ప్రీ మెచ్యూర్ ప్రసవాలపై అవగాహన కలిగించే ఉద్దేశంతో ఏటా నవంబరు 17న ప్రీమెచ్యూరిటీ డేగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఏటా భిన్నమైన థీమ్స్‌తో ఈ డే నిర్వహిస్తారు. ఈ ఏడాది 'ఏటా 1.3 కోట్ల మంది చిన్నారులు ముందుగా పుడుతున్నారు. వీరికి నాణ్యమైన వైద్యాన్ని అన్నిచోట్ల అందిద్దాం' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రీ మెచ్యూరిటీ డే సందర్భంగా అందిస్తున్న ప్రత్యేక కథనం...

నెలలు నిండిన అనంతరం ప్రసవం అయితేనే శిశువు పరిపూర్ణ ఆరోగ్యంతో ఉంటుంది. ఇటువంటి ప్రసవమే తల్లికి, బిడ్డకు శ్రేయస్కరం. అయితే, కొన్ని కారణాల వల్ల 36 వారాలలోపే ప్రసవించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నెలలు నిండకుండా పుట్టే చిన్నారుల్లో అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. ముఖ్యంగా 24 నుంచి 30 వారాల మధ్య పుట్టే చిన్నారుల పరిస్థితి బాగా ఇబ్బందికరంగా ఉంటుంది. మెరుగైన వైద్యాన్ని అందించగలిగినప్పుడు మాత్రమే అటువంటి చిన్నారులను రక్షించుకునే అవకాశం ఉంటుంది. అలాగే 30 వారాలు నుంచి 36 వారాల మధ్య పుట్టే చిన్నారులను మెరుగైన వైద్య సేవలను అందించడం ద్వారా కోలుకునేలా చేయవచ్చు.

ఇవీ ఇబ్బందులు..

నెలలు నిండకుండా పుట్టే చిన్నారుల్లో ప్రధానంగా ఊపిరితిత్తులు సమస్య తలెత్తే అవకాశం ఉంది. అలాగే గుండె, మెదడు, నాడీ, జీర్ణ వ్యవస్థలు పూర్తిగా ఎదగవు. దీనివల్ల వెంటిలేటర్ సహాయంతో చిన్నారికి కృత్రిమ శ్వాస అందించాల్సి ఉంటుంది. ఐవీ ద్వారా పోషకాలను అందించాలి. నాడీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు ఇంకుబేటర్స్‌లో పెట్టాల్సి వస్తుంది. ఈ చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఇన్‌ఫెక్షన్స్ ముప్పు కూడా అధికంగా ఉంటుంది. కాబట్టి, వీరిని నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో పెట్టి మెరుగైన వైద్య సేవలను అందించాల్సి ఉంటుంది. అవయవాల్లో ఎదుగుదల లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుంటాయని వైద్యులు చెబుతున్నారు.

కొన్ని జాగ్రత్తలను పాటించడం ద్వారా ప్రీ మెచ్యూర్ ప్రసవాలను నిలిపే అవకాశం ఉంది. గర్భంతో ఉన్నప్పుడు పోషకాహారాన్ని అందించాలి. అలాగే నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకుంటుండాలి. ఇన్‌ఫెక్షన్ బారినపడ కుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎనిమియా వంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి.

వీరిలో ప్రీమెచ్యూర్ ప్రసవాలు ఎక్కువ..

ప్రీ మెచ్యూర్ ప్రసవాలు ఎక్కువగా యూరినరీ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడే వారిలో జరిగే అవకాశం ఉంది. ఫ్లూ జ్వరాలు, డయాబెటిస్ సమస్య, గర్భం దాల్చిన తరువాత బరువులు ఎత్తే పనులు చేసే వారిలో, రక్తహీనత, గుండె జబ్బులు, బీపీ, ఇతర అనారోగ్య సమస్యలు, ఉమ్మనీరు లీక్ కావడం వంటి ఇబ్బందులు/కారణాలు వల్ల ముందస్తు ప్రసవాలు జరుగుతుంటాయి. వైద్యుల సూచనలు పాటించడం ద్వారా ప్రీమెచ్యూర్ ప్రసవాలను నివారించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ప్రీమెచ్యూర్ ప్రసవాలు ఎక్కువే..

ప్రీ మెచ్యూర్ ప్రసవాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. కేజీహెచ్‌లో ప్రతిరోజూ 20 వరకు ప్రసవాలు జరుగుతుంటే, అందులో రెండు నుంచి మూడు ఉంటున్నాయి. నగర పరిధిలోని ఇతర ఆస్పత్రుల్లోనూ ఈ తరహా ప్రసవాలు అధికంగానే జరుగుతున్నట్టు చెబుతున్నారు.



మెరుగైన వైద్యం అందించడం ద్వారా కాపాడవచ్చు



ప్రీ మెచ్యూర్ బేబీలను మెరుగైన వైద్యం అందించడం ద్వారా కోలుకునేలా చేయవచ్చు. బరువు తక్కువగా ఉండడం ప్రధానమైన సమస్యగా ఉంటుంది. కొన్నిసార్లు ఆర్గాన్స్‌లో ఇబ్బందులు ఉంటాయి. నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఉండే ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించడం ద్వారా బిడ్డ ప్రాణాలను రక్షించవచ్చు. కేజీహెచ్‌లో ప్రతిరోజూ ఈ తరహా ప్రసవాలు రెండు వరకు అవుతుంటాయి. కంగారూ కేర్ యూనిట్ కూడా ఉంది. బిడ్డను తల్లి గుండెలపై పెట్టుకునేలా చేయడం ద్వారా అవసరమైన వేడిని అందిస్తాం. దీనివల్ల నాడీ, ఇంద్రియ వ్యవస్థలు మెరుగుపడతాయి.

- డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి, గైనకాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

విజయం సాధించే వరకూ విశ్రమించొద్దు

- జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఎంవీపీ కాలనీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోటీ పరీక్షల్లో విజయం సాధించే వరకూ ప్రయత్నాన్ని విరమించవద్దని డీఎస్సీ ఉచిత శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, బీసీ, ఈబీసీ అభ్యర్థులకు ఎంవీపీ కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శనివారం ఏర్పాటు చేసిన డీఎస్సీ ఉచిత శిక్షణను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకొని, కష్టపడి చదివితే సానుకూల ఫలితాలు వస్తాయన్నారు. ప్రణాళిక ముఖ్యమన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. యోగా, ధ్యానం, వ్యాయామాల ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. వ్యక్తిగత క్రమశిక్షణ, అంకిత భావం ముఖ్యమన్నారు. శిక్షణ కాలంలో 75 శాతం హాజరు ఉన్న అభ్యర్థులకు రూ.1500లు, మెటీరియల్ కోసం రూ 1000 అందజేయనున్నట్టు తెలిపారు. అనంతరం కలెక్టర్ బీసీ స్టడీ సర్కిల్‌లోని వివిధ విభాగాలను సందర్శించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారిణి శ్రీదేవి, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ రామారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు

పరవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించాడు...ఆపై కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని పోక్సో యాక్ట్ కింద కేసు నమోదుచేశారు. ఇందుకు సంబంధించి అనకాపల్లి జిల్లా పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ శనివారం రాత్రి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

ఏలూరు జిల్లాకు చెందిన సూర్య (30) అనకాపల్లి సమీపంలోని కొండుపాలెంలో గల కోళ్లఫారంలో కొన్నేళ్లుగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆ కోళ్లఫారంలో ఓ బాలిక (15) పనిచేస్తున్నది. ఆమెకు సూపర్‌వైజర్ ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పాడు. ఆ బాలిక సమీపంలోని ఒక గ్రామంలో సోదరి వద్ద ఉంటోంది. ఈనెల 12న బాలిక సోదరి ఇంట్లో లేని సమయంలో సూర్య అక్కడకు వెళ్లి ఆమెను ఏలూరు తీసుకువెళ్లిపోయాడు. తన చెల్లి కనిపించడం లేదని అదేరోజు రాత్రి బాలిక సోదరి పరవాడ పోలీసులు ఫిర్యాదు చేసింది. పోలీసులు అదృశ్యం కేసుగా నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను సూర్య తీసుకువెళ్లినట్టు గుర్తించారు. శుక్రవారం ఇద్దరినీ అక్కడ నుంచి పరవాడ స్టేషన్‌కు తీసుకువచ్చారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యానికి తరలించారు. మాయమాటలతో బాలికను లోబరుచుకొని కిడ్నాప్, ఆపై అత్యాచారం చేసిన సూర్యపై బీఎన్ఎస్ 64 (2) (ఎం), 65 (1), 87, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదుచేశారు. నిందితుడిని ఆదివారం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తామని డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐ మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రోడ్డు ప్రమాద బాధితుల సంస్మరణ దినం

ఏయూలోని వైవీఎస్‌మూర్తి ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమం

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని ఆదివారం నగర పోలీసులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సీపీ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా నవంబరు నెలలోని మూడో ఆదివారాన్ని రోడ్డు ప్రమాద బాధితుల సంస్మరణ దినంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు, గాయపడడంతో వైకల్యానికి గురైన బాధితులను ఆహ్వానించామన్నారు. బాధితులకు అందాల్సిన పరిహారం, ఇతర ప్రయోజనాలు ఏమైనా పెండింగ్‌లో ఉంటే వాటిని పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని ట్రాఫిక్ విభాగానికి చెందిన పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

రియల్టర్‌పై దాడి కేసులో నలుగురి అరెస్టు

ఎండాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెం స్టేషన్ పరిధిలో రియాల్టర్ పై జరిగిన దాడి కేసులో నలుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పీఎంపాలెం రెండో బస్టాప్ ప్రాంతంలో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ తన ఇంటికి వెళ్తుండగా సోమశేఖర్, ఎ.కళావతి, వంక గోపాలకృష్ణ, బోరా కనకమహాలక్ష్మీలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ మేరకు పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చంద్రశేఖర్, సోమశేఖర్ మధ్య ఉన్న విభేదాల నేపథ్యంలో ఈ దాడి జరిగినట్టు పోలీసులు తెలిపారు.

విశాఖ ఉక్కు పరిరక్షణే ధ్యేయం

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

సిరిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్ని పోరాటాలైన ఎదురైనా విశాఖ ఉక్కును కాపాడుకుంటామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు అన్నారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐఎస్ఎఫ్ 32వ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అమ్ముతుందని, దీన్ని ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. 32 మంది ప్రాణత్యాగం చేసి స్థాపించిన ఉక్కు ఫ్యాక్టరీని కచ్చితంగా ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ 32వ జిల్లా మహాసభలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీను, యు.నాగరాజు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత విద్యాశాఖమంత్రి నారా లోకేష్ పాదయాత్రలో జీవో నెంబరు 77 ద్వారా ప్రైవేట్ పీజీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని చెప్పారన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీ-యింబర్స్‌మెంట్ రూ.3 వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే అవి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లో సదుపాయాలపై ఈ నెల 17న ఏయూ టీఎల్ఎన్ హాలులో జరిగే సభలో చర్చించడం జరుగుతుందన్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు కిరణ్, పురుషోత్తం, సింహాచలం, హేమానంద్, సోనియా, భవానీ, శేఖర్, గ్రేస్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

- వర్కర్లు, హెల్పర్ల ఆందోళన

సిరిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ ప్రభుత్వం వెంటనే జీవో ఇవ్వాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐద్వా ఆలిండియా సెక్రటరీ ఎస్.పుణ్యవతి, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మార్పు చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలని కోరారు. 42 రోజుల సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాలకు జీవోలు, సర్క్యులర్లు విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు అవుతున్నప్పటికీ నేటికీ అంగన్‌వాడీలకు మేలు జరిగే ఒక్క పని కూడా చేయలేదన్నారు.

బడ్జెట్ సమావేశాల్లో కూడా అంగన్‌వాడీల గురించి కనీసం ప్రస్తావన కూడా లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకొన్న అంగన్‌వాడీలకు నిరాశ మిగిలిందన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ అన్నిటికన్నా ముఖ్యంగా మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చే జీవో కూడా ఇవ్వకపోవడం బాధకరమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చి తాము లేవనెత్తిన అన్యాయమైన ప్రతి సమస్యను పరిష్కారం చేయాలని కోరుతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు వెంకటలక్ష్మి, దేవి, బృందావతి, పద్మావతి, శోభారాణి, నర్సమ్మ, కృపారాణి, సరస్వతి, శ్రీదేవి, అధిక సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రింగ్ వలలపై జేసీ ఆధ్వర్యంలో మళ్లీ చర్చలు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొందరు మత్స్యకారులు రింగ్ వలలు ఉపయోగించి చేపల వేట సాగిస్తున్నారని అందిన ఫిర్యాదులపై జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్ని వర్గాలను పిలిచి శనివారం సమావేశం నిర్వహించారు. మత్స్యశాఖ, మెరైన్ పోలీసులను భాగస్వాములను చేశారు. రింగ్ వలలపై నిషేధం ఉన్నందున వాటిని ఉపయోగించరాదని స్పష్టం చేశారు. దీనిని నిశితంగా పరిశీలించాలని ఆయా శాఖలకు సూచించారు.

6 నుంచి అంతర్రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల ఉద్యోగుల క్రీడా పోటీలు: ఆర్టీసీ ఈడీ రవివర్మ

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన రోడ్డు రవాణా సంస్థల ఉద్యోగుల క్రీడా పోటీలు డిసెంబరు ఆరు నుంచి విశాఖలో జరగ నున్నట్టు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) జీవీ రవివర్మ పేర్కొన్నారు. ఎంవీపీకాలనీలోని ఆర్టీసీ ఈడీ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆర్టీసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కైలాసగిరి పోలీస్ క్రీడా ప్రాంగణంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, వసతి, ఆహారం, మెడికల్, సెక్యూరిటీ వంటి వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ ఎ.విజయకుమార్, సీఎంఈ జీవీ విజయరత్నం, విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, అనకాపల్లి, విజయనగరం జిల్లాల జిల్లా ప్రజా రవాణాధికారులు కె.పద్మావతి, బి.అప్పలనారాయణ, రీజియన్ డీసీటీఎం జి.సత్యనారాయణ, విజయనగరం జోన్ డీసీపీఎం ఎం.సుధాబిందు, డీసీఎంఈ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్ స్కూల్ స్విమ్మింగ్ టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): వాల్తేరు రైల్వే స్పోర్ట్సు ఎరీనాలోని ఆర్ఆర్ ఆక్వా స్పోర్ట్సు ఆధ్వర్యంలో ఆదివారం ఇంటర్ స్కూల్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ జరగనుంది. ఒకరోజు జరిగే ఈ టోర్నీలో నగరంలోని సుమారు 25 స్కూళ్ల నుంచి దాదాపు 185 మంది చిన్నారులు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఫ్రీ స్టైల్, బటర్ ఫ్లై, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, ఐఎం ఈవెంట్‌లలో కేటగిరీల వారీగా పోటీలుంటాయన్నారు. గత ఏడాది నిర్వహించిన ఇంటర్ స్కూల్ టోర్నీలో నౌసనబాగ్ నేవీ చిల్డ్రన్ స్కూల్ చాంపియన్‌గా నిలిచిందన్నారు.

క్రైం... crime news

ఫార్మా బస్సు ఢీకొని బాలుడి మృతి



పవన్ కుమార్ (ఫైల్ ఫొటో)

అగనంపూడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓ ఫార్మా కంపెనీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఏడేళ్ల బాలుడు మృతి చెందాడు. రోడ్డు దాటుతున్న బాలుడిని బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే తనువు చాలించాడు. జాతీయ రహదారి అగనంపూడి సమీపంలో గల బీసీ కాలనీ వద్ద శనివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకొంది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం లక్కవరం శివారు మామిడిపల్లికి చెందిన దొగ్గ దేముళ్ల ఫార్మాసిటీలో ఓ కంపెనీలో పనిచేస్తూ స్థానికంగా కుటుంబంతో కలిసి ఉంటున్నారు. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం ఆయన డ్యూటీకి బయలుదేరారు. తండ్రితో పాటు సమీపంలో గల బస్టాప్‌నకు వెళ్లిన పవన్‌కుమార్ (7) జాతీయ రహదారిపై గల డివైడర్‌ను దాటి తిరిగి ఇంటికి వస్తుండగా ఫార్మాసిటీ నుంచి నగరానికి వస్తున్న ఓ ఫార్మా కంపెనీ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. బాలుడి తల పైనుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో ఘటనా స్థలిలోనే మృతిచెందాడు. పవన్‌కుమార్ స్థానికంగా గల ఓ ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. తమ కుమారుడిని బస్సు రూపంలో మృత్యువు కబళించడంతో తల్లిదండ్రులు దేముళ్ల, దేవీలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేవీ రిటైర్డు ఉద్యోగి ఆత్మహత్య

మల్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో శ్రీహరిపురం వీటీ కాలేజీ రోడ్డులో నివాసం ఉంటున్న నేవీ రిటైర్డు ఉద్యోగి సందీప్ (35) జీవితంపై విరక్తి చెంది శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నారు. భార్యతో ఇబ్బందులు, అన్నదమ్ములతో ఆస్తి వివాదాల కారణంగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. బయటకు వెళ్లిన భార్య వచ్చి ఎంతసేపు తలుపులు కొట్టినా సందీప్ నుంచి స్పందన లేకపోవడంతో బలవంతంగా తలుపులు తెరిచి చూసేసరికి బెడ్ రూమ్‌లో భర్త ఉరి వేసుకుని కనిపించారు. వెంటనే ఆమె మల్కాపురం పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యశ్రీ ఫ్రాడ్ కేసులో మరో ముగ్గురి అరెస్టు

ఎండాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యశ్రీ పేరుతో లింక్ పంపించి క్లిక్ చేస్తే నగదు జమ అవుతుందని చెప్పి ఇద్దరు మహిళలను మోసం చేసిన కేసులో సైబర్ క్రైమ్ పోలీసులు మరో ముగ్గురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నగరానికి చెందిన ఇద్దరు మహిళలకు ఈ ఏడాది జూలై నెలలో గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి, ఆరోగ్యశ్రీ కార్యకర్తలమని పరిచయం చేసుకున్నారు. మీకు ప్రభుత్వం నుంచి నగదు రావాల్సి ఉందని చెప్పి వారికి ఒక లింక్ పంపించారు. ఆ లింక్ క్లిక్ చేయగానే సదరు కేటుగాళ్లు మహిళల నుంచి అకౌంట్ల నుంచి రెండు లక్షల ఏనభై వేల రూపాయల వరకు కొట్టేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేసి, ఢిల్లీ కేంద్రంగా సాగిన ఈ వ్యవహారంలో అప్పట్లో ఇద్దరిని అరెస్టు చేయగా, శనివారం మరో ముగ్గురిని ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. కాకాని నరేంద్ర, శివరాత్రి కార్తీక్, పాలూరి ప్రసాద్‌ను అదుపులో తీసుకుని ట్రాన్సిట్ వారెంట్ ద్వారా విశాఖ తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు. ఇదే తరహా ఫిర్యాదులపై ఏపీలో 57 కేసులు, తెలంగాణలో 89 కేసులు నమోదయ్యాయన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



మృతుడు అప్పలనాయుడు (ఫైల్ ఫొటో)

ఆనందపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వాసునాయుడు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని వేములవలస గ్రామానికి చెందిన సాదిక అప్పలనాయుడు కూలి పనులు చేస్తుంటాడు. అతని భార్య రమణమ్మ, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా విజయనగరంలో నివాసం ఉంటున్నారు. ఈనెల 10న ఆమెకు డెలివరీ కావడంతో రమణమ్మ ఆస్పత్రిలో ఉంది. కుమార్తె డిస్చార్జ్ విషయమై అప్పలనాయుడు, రమణమ్మ మధ్య శుక్రవారం గొడవ జరిగింది. అదే రోజు సాయంత్రం ఇంటికి వచ్చిన అప్పలనాయుడు పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.